



నాగాయలంకలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

వీడని వాన

జిల్లాలో భారీ వర్షం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురుస్తున్న వర్షాలు బుధవారం కూడా కొనసాగాయి. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో విడతల వారీగా భారీ వర్షం కురిసింది. కోస్తాతీరం వెంబడి గురువారం కూడా భారీ వర్షాలు పడతాయని వాతావరణశాఖ హెచ్చరించింది. ఆరెంజ్ అలర్ట్‌ను కూడా జారీ చేసింది. ఈ నెల 28వ తేదీ వరకు ఉరుములు, మెరుపులతో కూడిన ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని స్పష్టం చేసింది. దీంతో పంటలు దెబ్బతింటాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడన ద్రోణి
- నేడు కోస్తాతీరం వెంబడి భారీ వర్షాలు కురిసే అవకాశం
- ఫ్లాష్‌ఫ్లడ్ హెచ్చరిక జారీ చేసిన వాతావరణ శాఖ
- పంటలు దెబ్బతింటాయని రైతుల్లో ఆందోళన
- పొంగి ప్రవహిస్తున్న డ్రెయిన్లు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లాలో గత మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల వరి పొలాల్లోకి పెద్ద ఎత్తున వర్షపు నీరు చేరింది. ఆలస్యంగా వరినాట్లు వేసిన పొలాల్లో పైరు పొట్టదశ, ముందస్తుగా నాట్లు పూర్తి చేసిన పొలాల్లో ఈత దశ, కంకులు పాలుపోసుకునే దశ, మరికొన్ని చోట్ల కోతకు సిద్ధంగా ఉంది. గురువారం కూడా జిల్లాలో భారీ వర్షం కురుస్తుందని, ఈ నెల 28వ తేదీ వరకు వర్షాలు పడతాయనే హెచ్చరికలతో రైతుల్లో భయం నెలకొంది. రానున్న 24 గంటల వ్యవధిలో కోస్తాతీరం వెంబడి భారీ వర్షాలు కురుస్తాయని, ఫ్లాష్‌ఫ్లడ్ హెచ్చరికలను వాతావరణశాఖ బుధవారం సాయంత్రం జారీ చేసింది. దీంతో ఏ క్షణంలో భారీవర్షం కురుస్తుందోననే భయం రైతులను వెంటాడుతోంది. భారీవర్షాలు కురిస్తే బ్రు



వర్షాలతో వరి పొలాలకు పొంచి ఉన్న ముప్పు

పొట్ట దశలో ఉన్న పైరు, ఈనిన తర్వాత కంకులు పాలు పోసుకునేదశలో ఉన్న వరికి తెగుళ్ల బెడద, దోమపోటు అధికమవుతుందని రైతులు చెబుతున్నారు. వర్షాలు ఆగిపోయిన తర్వాత వీటి ప్రభావం మరింత అధికమవుతుందని అంటున్నారు. వర్షాలతో పాటు సముద్ర తీరం వెంబడి గంటకు 45 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రానున్న నాలుగైదు రోజుల పాటు ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయోనని రైతలు ఆందోళన చెందుతున్నారు.

కూరగాయ తోటలకు ఇబ్బందే..

కృష్ణానది తీరం వెంబడి ఉన్న పెనమలూరు, ఉయ్యూరు. తోట్లవల్లూరు మోపిదేవి, అవనిగడ్డ, చల్లపల్లి, తదితర మండలాల్లో సాగు చేసిన కూరగాయల తోటలకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు నష్టం కలుగజేస్తాయని రైతులు భయపడుతున్నారు. ఇప్పటికే తయారైన కూరగాయలను సకాలంలో కోయకుంటే వర్షంలో తడిచి కుళ్లిపోతాయని, పూత, పిందెలు రాలిపోతాయని రైతులు అంటున్నారు. కూరగాయల తోటల్లో రోజుల తరబడి వర్షపు నీరు నిలబడి ఉంటే మొక్కలు చనిపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం పగలు జోరువాన కురవడంతో కూరగాయలు కోసేందుకు అవకాశం లేకుండా పోయింది. కార్తీకమాసం ప్రారంభం కావడంతో కూరగాయల ధరలు పెరిగే సమయంలో వర్షం రూపంలో ఆటంకం ఏర్పడిందని

మిగతా 6లో..

దాళ్వా పంటకు నీరివ్వండి

సముద్రతీర ప్రాంత మండలాల్లో చాలా అవసరం

- రెండో పంటగా వరి తప్ప మరొకటి వేయడానికి లేదు
- కలెక్టర్ బాలాజీకి పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ విజ్ఞప్తి
- రైతులతో కలిసి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేత



రైతులతో కలిసి కలెక్టర్ బాలాజీకి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్

మచిలీపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సముద్ర తీర ప్రాంతంలోని మండలాలకు రబీ సీజన్‌లో దాళ్వా పంట సాగు చేసేందుకు నీరు విడుదల చేయాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ కోరారు. పెడన నియోజకవర్గంలోని వివిధ మండలాల రైతులతో కలిసి ఆయన బుధవారం కలెక్టరేట్‌కు వెళ్లారు. కలెక్టర్ చాంబరులో కలెక్టర్ బాలాజీతో మాట్లాడారు. పెడన నియోజకవర్గంలోని మండలాలు సముద్రతీరం వెంబడి ఉండటంతో భూముల్లో చౌడు శాతం అధికంగా ఉంటుం దన్నారు. దీంతో రెండో పంటగా మినుములు సాగు చేసేందుకు అవకాశం లేదన్నారు. సాగునీటిని విడుదల చేస్తే వరి సాగు చేస్తామని ఈ ప్రాంత రైతులు చెబుతున్నారని కలెక్టర్‌కు వివరించారు. రెండో పంటకు సాగునీరు విడుదల చేయకుంటే భూముల్లో ఇతర పంటలు సాగు చేసేందుకు అవకాశం లేక ఖాళీగా ఉంచాల్సి వస్తోందని, దీంతో భూములు మరింతగా చౌడు బారిపోతున్నాయని తెలిపారు. దాళ్వా పంట సాగు చేస్తే రైతులు కొంత మేర ఆర్థికంగా నిలదొక్కుకుంటారని, కూలీలకు

మిగతా 6లో..



చుట్టూ ఇనుపకంచె ఉన్నా.. మధ్యలో ఉన్న పుంజులు కనిపించకుండా పోతున్నాయి. షెడ్ల కింద తాళ్లతో కట్టేసిన గొర్రెలు తెల్లారేసరికి మాయమవుతున్నాయి. ఈ ఘటనల వెనుక ఉన్న గ్యాంగ్ 'స్టూవర్టుపురం' అని తేలింది.

కోళ్లు కొట్టేస్తున్నారు..!

పందెం పుంజులు, గొర్రెలే టార్గెట్‌గా చోరీలు

- రెండు జిల్లాల శివారుల్లో స్టూవర్టుపురం దొంగల హల్‌చల్
- పగలు కారులో సంచారం.. అర్ధరాత్రి దొంగతనం
- జగ్గయ్యపేట వద్ద చిక్కినట్టే చిక్కి పారిపోయిన గ్యాంగ్
- ఓ నిందితుడ్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు


(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : సరిహద్దు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పందెంకోళ్లు, గొర్రెలను చోరీ చేస్తున్న ముఠా ఉమ్మడి కృష్ణాజిల్లాలో అడుగుపెట్టింది. ఇందులో ఓ నిందితుడు పోలీసులకు చిక్కాడని తెలిసింది. స్టూవర్టుపురం నుంచి ఐదారుగురు సభ్యులతో ఉన్న గ్యాంగ్ ఉమ్మడి జిల్లాలో తిరుగుతోంది. వ్యాన్‌లో తిరుగుతూ అర్ధరాత్రి సమయంలో ఈ పశుసంపదను మాయం చేస్తున్నారు. ఇప్పటికే వందల సంఖ్యలో గొర్రెలు, కోడిపుంజులను ఇక్కడి నుంచి తరలించి సంతల్లో అమ్మేసినట్టు తెలిసింది. ఎన్టీఆర్ జిల్లాలో తెలంగాణకు సరిహద్దులుగా ఉన్న గ్రామాల్లో చాలామంది పశుసంపదపై ఆధారపడి జీవిస్తుంటారు. గొర్రెలు, మేకలు పెంచుతూ జీవిస్తారు. కృష్ణాజిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో కోడిపుంజులను పెంచుతుంటారు. జనవరిలో సంక్రాంతి సంబరాల్లో మూడు రోజుల పాటు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కోడిపందేలు వేస్తారు. ఇక్కడ జరిగే కోడిపందేలను వీక్షించడానికి తెలంగాణ నుంచి వస్తారు. ఈ పందేల్లో కాలు దువ్వే పుంజులను ఇప్పటి నుంచే బలీయంగా తయారు

మిగతా 6లో..

తప్పులతడక

ఓఆర్ఆర్ 3ఏ ప్రతిపాదనల్లో తప్పులు

- రెండు జిల్లాలకు వెనక్కి పంపిన ఎన్‌హెచ్ అధికారులు
- అలైన్‌మెంట్‌కు అనుగుణంగా సరిచేయాలని సూచన
- తప్పులు సరిచేసే పనిలో రెవెన్యూ యంత్రాంగాలు
- పీపీపీ అప్రైజల్ కమిటీకి వెళ్లిన ఆర్థిక ప్రతిపాదనలు
- 40 శాతం నిధులు ఇవ్వనున్న కేంద్ర ప్రభుత్వం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు వెళ్లే పరిధిలోని ఐదు జిల్లాల్లో ఒక్క పల్నాడు జిల్లా నుంచే పూర్తిస్థాయిలో 3ఏ ప్రతిపాదనలు అందాయి. ఈ ప్రతిపాదనల్లో భాగంగా సేకరించాల్సిన భూములకు సంబంధించిన పూర్తి వివరాలను రెవెన్యూ శాఖ పొందుపరచాలి. భూమి ఉన్న ప్రాంతం, సరిహద్దులు, వైశాల్యం, భూయజమానులు, కౌలుదారులు, వారి పేర్లు, భూమి ప్రస్తుత వినియోగం.. వంటి వివరాలతో పాటు ప్రాజెక్టుకు అవసరమైన అనేక వివరాలు ఉంటాయి. ఇది ఒకరకంగా చట్టపరంగా భూ సేకరణ ప్రారంభించే ప్రక్రియ. ఈ వివరాల్లో ఎక్కడ తప్పులు చోటుచేసుకున్నా భూసేకరణ విషయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది. రెవెన్యూ శాఖ నుంచి వచ్చే 3ఏ ప్రతిపాదనలను ఆమోదించాక సెక్షన్ 3డీ ప్రకారం పబ్లిక్ నోటీసు జారీచేసి అభ్యంతరాలు, సలహాలు, సూచనలను స్వీకరిస్తారు. ఆ తర్వాత సెక్షన్ 3జీ ప్రకారం నష్టపరిహారం నిర్ణయించే వంటి దశలు ఉంటాయి. అంతిమంగా భూ సేకరణకు సంబంధించిన గజిట్ నోటిఫికేషన్‌ను వెలువరిస్తారు. ఈ దశలన్నింటికీ కీలకమైన 3ఏ ప్రతిపాదనల్లో తప్పులతడకలు ఉండకూడదు. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల నుంచి వచ్చిన 3ఏ భూ ప్రతిపాదనల్లో తప్పులు ఉన్న విషయాన్ని గుర్తించిన ఎన్‌హెచ్ అమరావతి డివిజన్ అధికారులు వాటిని వెనక్కి పంపారు.

అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్)కు సంబంధించి ఎన్టీఆర్, కృష్ణాజిల్లా యంత్రాంగాలు పంపిన భూ ప్రతిపాదనలు తప్పులతడకలయ్యాయి. నిర్దేశించిన అలైన్‌మెంట్ ప్రకారం రెండు జిల్లాల రెవెన్యూ యంత్రాంగాలు తొందరపాటు చర్యలు తీసుకోవడం వల్లే ఈ పరిస్థితి ఎదురైంది. దీంతో ప్రతిపాదనలు వెనక్కి తిరిగి వచ్చాయి. వీటిని సరిచేసి ఇవ్వాల్సిందిగా ఎన్‌హెచ్ కోరటంతో ఈ ప్రాజెక్టు జాప్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

తప్పులు ఎలా తెలిశాయంటే..

తప్పులను ఎన్‌హెచ్ అధికారులు ఎలా గుర్తించారంటే.. అలైన్‌మెంట్‌ను నిర్దేశించిన క్రమంలోనే డేటాను ఆన్‌లైన్ ఆధారంగా తెలుసుకున్నారు. నిర్దిష్టమైన సర్వే నెంబర్లుగా అలైన్‌మెంట్‌ను పెగ్‌మార్కింగ్

మిగతా 6లో..



విజయవాడ టు సింగపూర్

ఇండిగో బుకింగ్స్ ప్రారంభం

- నవంబరు 10 నుంచి విమాన సర్వీసు
- ప్రారంభ ధర రూ.7,500గా నిర్ణయం
- ఉదయం 10.05 గంటలకు ప్రయాణం
- విజయవాడ నుంచి సింగపూర్‌కు 4 గంటల ప్రయాణం

6



6

నేడు ఇంద్రకీలాద్రిపై గాజుల మహోత్సవం



రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- కలెక్టర్ బాలాజీ
- కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహణ

8

హంసలదీవి బీచ్ మూసివేత

అర్బన్ బ్యాంకుకు పూర్వవైభవం తెస్తాం

- నూతన చైర్మన్ ఐ.దిలీప్‌కుమార్
- ఘనంగా మచిలీపట్నం అర్బన్ బ్యాంకు నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం

6

కొండెక్కిన ఇసుక ధరలు

టిప్పర్ రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు అమ్మకాలు

- క్వారీల్లో లారీ యజమానుల నుంచి భారీగా చార్జీల వసూలు
- దీంతో వినియోగదారులపై పెరుగుతున్న భారం
- అవనిగడ్డ నియోజకవర్గంలో 3 నెలల క్రితం మూతపడిన క్వారీ
- బయట నుంచి తెప్పించుకోవడంతో భారీగా చెల్లించుకోవాల్సిన దుస్థితి
- నియోజకవర్గంలోని క్వారీకి అనుమతి ఇవ్వాలని వేడుకోలు

ఇసుక క్వారీ (ఫైల్)





మద్దూరు నుంచి వస్తున్న ఇసుక లారీ

రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇస్తున్నట్లుగా పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నప్పటికీ అవనిగడ్డ నియోజకవర్గంలో ఇసుక సామాన్యుడికి అందటం లేదు. క్వారీ నిర్వాహకులు లారీ యజమానులకు లోడింగ్ సమయంలో భారీగా చార్జీలు విధించడంతో ఆ భారం వినియోగదారుడిపై పడుతోంది. టిప్పర్ ఇసుక రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు చేరుతోంది. నియోజకవర్గంలోని క్వారీ మూతపడటంతో స్థానికులు ఇసుక కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధిక ధర చెల్లించి కొనుగోలు చేసి ఆర్థికంగా నష్టపోతున్నారు. అధికారులు స్పందించి క్వారీకి అనుమతి ఇవ్వాలని వేడుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి-అవనిగడ్డ: అవనిగడ్డ నియోజకవర్గం శ్రీకాకుళంలో ప్రభుత్వం క్వారీని ఏర్పాటు చేసి ఉచితంగా ఇసుకను కొంతకాలం పాటు సరఫరా చేసింది. గడిచిన మూడు నెలలుగా శ్రీకాకుళం క్వారీకి అనుమతులు నిలిపివేయటంతో దివి వాసులకు ఇసుక కష్టాలు మొదలయ్యాయి. వైసీపీ పాలనలో టన్ను ఇసుకను రూ.375కు విక్రయించగా, కాంట్రాక్టర్లు దానికి మరింత జోడించి, లోడు ఇసుక రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు అమ్మకాలు చేశారు. ఉచిత ఇసుక విధానం అమలులోకి వచ్చిన తర్వాత కూడా గడిచిన మూడు నెలల కాలంలో నియోజకవర్గంలో ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

నియోజకవర్గంలో క్వారీ తెరవాలి!

శ్రీకాకుళంలో క్వారీ ఉన్న సమయంలో 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోడూరు, నాగాయలంక మండలాలకు ఇసుక రూ.12 వేలలోపే చేరేది. ఇప్పుడు అదే ఇసుకను రూ.20 వేలు పైబడి కొనుగోలు చేస్తున్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. పక్కనే నదీ ఉండి అందుబాటులో అపారమైన ఇసుక ఉండి కూడా ప్రభుత్వం తవ్వకాలకు అనుమతులు ఇవ్వకపోవటంతో పక్క నియోజకవర్గాల నుంచి ఇసుకను అధిక ధరలకు కొనుగోలు చేసి తెచ్చుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి నియోజకవర్గంలో ఒక క్వారీ తెరవాలని కోరుతున్నారు.

రూ.20 వేలు దాటిన లోడు ఇసుక

నిన్న మొన్నటి వరకు లారీ లోడు రూ.13 వేల నుంచి రూ.14 వేలకు లభించగా, నేడు అదే ఇసుకను రూ.20 వేల నుంచి రూ.22 వేల మధ్య కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. శ్రీకాకుళం క్వారీ మూతపడిన తర్వాత నియోజకవర్గ ప్రజల అవసరాల కోసం అప్పారావుపేట, మద్దూరు, వల్లూరుపాలెం క్వారీలపై ఆధారపడాల్సి వస్తుంది. దీంతో పెరిగిన

మిగతా 6లో..

విజయవాడ టు సింగపూర్

ఇండిగో బుకింగ్స్ ప్రారంభం

» నవంబరు 10 నుంచి విమాన సర్వీసు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): సింగపూర్‌కు ఫ్లైట్ బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సింగపూర్‌లోని ఛాంగీ విమానాశ్రయానికి నవంబరు 10 నుంచి ఇండిగో సంస్థ సర్వీసును ప్రారంభిస్తోంది. ఈ క్రమంలో వెబ్‌సైట్ ద్వారా బుకింగ్స్‌ను ప్రారంభించింది. ధర రూ.7500గా నిర్ణయించింది. వారంలో 3 రోజులపాటు (మంగళ, గురు, శని) విమాన సర్వీసు విజయవాడ నుంచి ఉదయం 10.05లకు బయలుదేరి మధ్యాహ్నం 2.05 గంటలకు సింగపూర్‌లోని ఛాంగీ విమానాశ్రయంలో ల్యాండ్ అవుతుంది. బుకింగ్స్ ప్రారంభించిన నేపథ్యంలో, ప్రయాణీకుల నుంచి ఆదరణ లభిస్తున్నది. డైనమిక్ ఫేర్ అమల్లో ఉండటం వల్ల చివరి నిమషంలో ప్రయాణించే వారికి టిక్కెట్ ధర రూ.10 వేలు పలికే అవకాశం ఉంది. ముందుగా బుక్ చేసుకునే వారు బేసిక్ ప్రైజ్ రూ.7500లకు ప్రయాణించవచ్చు. సింగపూర్‌కు విమాన సర్వీసు ద్వారా కేవలం రూ. 25 వేలతో ఒక వ్యక్తి పర్యాటకంగా సింగపూర్‌కు వెళ్లి రావచ్చు. రానూ పోనూ టిక్కెట్లు బుక్ చేసుకుంటే రూ. 15 వేలు ఖర్చు అవుతుంది. బడ్జెట్ అకామిడేషన్, ప్రభుత్వ ట్రాన్స్‌పోర్ట్‌ను ఉపయోగించుకోగలిగితే.. రెండు రోజుల పాటు పర్యాటకంగా కూడా సింగపూర్‌లో హాయిగా గడిపిరావటానికి అవకాశం ఉంటుంది.



హంసలదీవి బీచ్ గేట్లు మూసివేసిన సిబ్బంది

హంసలదీవి బీచ్ మూసివేత

కోడూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో హంసలదీవి బీచ్ గేట్లు మూసివేస్తున్నట్టు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నాగమణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం సముద్రపు అలలు ఎగసిపడుతున్నందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రేపటి నుంచి రెండు రోజులపాటు పాలకాయితిప్ప వద్ద ఉన్న హంసలదీవి బీచ్ గేట్లు మూసి వేస్తున్నామన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్‌బ్యాంకు చైర్మన్ దిలీప్‌కుమార్

అర్బన్ బ్యాంకుకు పూర్వవైభవం తెస్తాం

» నూతన చైర్మన్ ఐ.దిలీప్‌కుమార్

మచిలీపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం కో-ఆపరేటివ్ అర్బన్‌బ్యాంకుకు పూర్వవైభవం తీసుకువస్తామనిబ్యాంకు నూతన చైర్మన్ ఐ.దిలీప్‌కుమార్ అన్నారు. అర్బన్‌బ్యాంకు నూతన పాలకవర్గం గురువారం ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో బుధవారం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో మీడియా సమావేశం నిర్వహించారు. 105 సంవత్సరాల చరిత్ర ఉన్న అర్బన్‌బ్యాంకు ఇటీవల కాలంలో గత వైభవాన్ని కోల్పోయిందన్నారు. చిరువ్యాపారులకు స్వల్పకాలిక రుణాలు అందజేయడంతోపాటు, బ్యాంకును ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పాలకవర్గ సభ్యులు కృషి చేయాలన్నారు. పాలకవర్గం ప్రమాణస్వీకారం రోజున కోటిరూపాయలకు పైగా బ్యాంకులో డిపాజిట్లు సేకరించేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. మాజీమంత్రి నడకుదిటి నరసింహారావు చైర్మన్‌గా పనిచేసినకాలంలో బ్యాంకు చిరువ్యాపారులకు రుణాలు అందించి ఆర్థికంగా పురోభివృద్ధి సాధించిందన్నారు. బ్యాంకుకు గత వైభవం తీసుకువచ్చేందుకు మంత్రి రవీంద్ర ముందుచూపుతో బ్యాంకింగ్, సహకారరంగంలో నిష్ణాతులైన వారిని డైరెక్టర్‌లుగా ఎంపికచేశారన్నారు. గురువారం ఉదయం 11.34గంటలకు నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు. సమావేశంలో అర్బన్‌బ్యాంక్ డైరెక్టర్‌లుగా నియమితులైన వేము కోటేశ్వరరావు, నూకల రమాదేవి, గెల్లి అరుణకుమారి, వంపుగడవల చౌదరి, పోతాబత్తుల పాండురంగారావు, సూరిశెట్టి హరికృష్ణ, బొర్రా శ్రీనివాస్, గున్నం నాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.



హసీంబేగ్‌ను సత్కరిస్తున్న మైనారిటీ నేతలు

పేద మైనారిటీ వర్గాల అభివృద్ధికి కృషి

మచిలీపట్నం టౌన్ : పేద మైనారిటీ వర్గాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని మైనారిటీ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ హసీంబేగ్ అన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో పెద్ద ఎత్తున మైనారిటీ నాయకులు సమావేశమై ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హసీంబేగ్ మాట్లాడుతూ, ఇంకా వెనుకబాటులో ఉన్న ముస్లిం మైనారిటీ వర్గాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మచిలీపట్నంలో మైనారిటీ గురుకుల పాఠశాల భవన నిర్మాణాలు చేపట్టేందుకు యోచిస్తున్నామని, దీనిని మంత్రి రవీంద్ర దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

లకిరెడ్డి కళాశాలలో జాబ్‌మేళా రేపు

మైలవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 24న జరిగే జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఇళ్లరవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, డిగ్రీ కళాశాలలోని జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జెకెసి), జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్డీఏ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహిస్తున్నారన్నారు. సుమారు 28 కంపెనీలు హాజరవుతున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. శివునిక్ టెక్, విక్టర్ ఇండియన్ టెక్నికల్ సపోర్ట్, కాంసెంట్రిక్, హెట్రో లాబ్స్, టాటా ఎలక్ట్రానిక్స్ వంటి ప్రముఖ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని ఆయన తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన 18 నుంచి 35 ఏళ్ల వయస్సులోపు వారు అర్హులని, ఎంపికైన వారికి నెలకు సుమారు రూ.12 నుంచి రూ.35వేల వరకు వేతనంతో పాటు ఇతర సౌకర్యాలతో కూడిన అవకాశాలు ఉంటాయని, అభ్యర్థులను ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయనున్నట్టు తెలిపారు.

http-s:\\tinyurl.com\jobmela.naipunyam రిజిస్ట్రేషన్ లింకులో పూర్తి వివరాలతో అభ్యర్థుల పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. జాబ్ మేళాకు బయోడేటా, ఆధార్, సర్టిఫికెట్ల నకళ్లతో హాజరుకావాలన్నారు. వివరాలకు 9966090377, 9959108829 నెంబర్లలో సంప్రదించాలన్నారు.



మల్లేశ్వర ఆలయంలో సహస్రలింగార్చన



సహస్రదీపార్చన, ఊంజల్ సేవలో ఈవో, చైర్మన్ దంపతులు



దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు

ఇంద్రకీలాద్రిపై కార్తీక శోభ

» దుర్గగుడిలో ఘనంగా సహస్రలింగార్చన

» నేడు దుర్గమ్మకు గాజుల అలంకరణోత్సవం





ఆలయంలో గాజుల మాలలు అలంకరిస్తున్న సిబ్బంది

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం వచ్చేసింది. నెల రోజుల పాటు ఆధ్యాత్మిక సంపద తులతూగుతుంది. శివా అంటేనే పరవశించే లయకారుడు పరమేశ్వరుడు పరమానంద భరితుడై భక్తుడికి విశేష ఫలితాలను ఇస్తారని నమ్మిక. కార్తీక మాసం చలి వేళలో చన్నీటి స్నానం చేసి వేకువజామునే శివుడిని ఆరాధిస్తే వచ్చే ఆనందానుభూతి మరెక్కడా ఉండదని చెబుతారు. కార్తీక మాసం ప్రారంభం కావడంతో శివాలయాలు శివ నామస్మరణ మారుమోగుతాయి. నమక, చమక పారాయణలు హోరెత్తుతున్నాయి. శివాలయాలలో సహస్రలింగార్చనలు ప్రారంభమయ్యాయి. దుర్గామల్లేశ్వర దేవస్థానంలో బుధవారం సహస్రలింగార్చన కార్యక్రమాన్ని ప్రారంభించారు. శివారాధనలో రంగావజ్ఝుల శ్రీనివాసశాస్త్రి తదితర అర్చకులు శాస్త్ర సమ్మతంగా సహస్రలింగార్చన చేశారు. సహస్రలింగార్చన, సహస్రదీపార్చన, ఊంజల్ సేవలలో ఈవో శీనానాయక్ దంపతులు, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు పాల్గొని పూజలు చేశారు. ప్రదోష కాలములో 'మహా నివేదన', పంచ హారతులు, చతుర్వేద స్వస్తి జరిగాయి. గురువారం రోజున అమ్మవారి ఆలయంలో "గాజుల ఉత్సవం" భగినీ హస్త భోజనం (యమ ద్వితీయ) నిర్వహిస్తారు. భక్తులు కూర్చిన గాజుల మాలలను అలంకరణ చేస్తారు. సిద్ధమైన గాజుల మాలలను చైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు తిలకించి నమస్కారం చేసుకున్నారు.

కార్తిక మాసం సందర్భంగా వైదిక కార్యక్రమాలను శుభసంకల్పంతో దీక్షాపూర్వకంగా బుధవారం ప్రారంభించారు. మల్లేశ్వరస్వామి ఆలయములో వచ్చేనెల 20న గురువారం వరకు నెల రోజులు పాటు విశేష అర్చన, అభిషేకాది కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ క్రమంలో బుధవారం ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణతో పాటు ఈవో శీనానాయక్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వైదిక కమిటీ, స్థానాచార్యుడు వి.శివప్రసాద్‌శర్మ పూజలు నిర్వహించారు.

వీడని వాన

(5వ పేజీ తరువాయి)

రైతులు అంటున్నారు. పసుపు తోటల్లో నీరు నిలబడి ఉంటే పసుపుపైరు చనిపోతుందని చెబుతున్నారు. ఉదయం 8.30 గంటల వరకు గూడూరులో అత్యధికంగా 21.4 మిల్లీమీటర్లు, అత్యల్పంగా తోట్లవల్లూరులో 1.2 మిల్లీమీటర్లు వర్షం పడింది. జిల్లా సగటు వర్షపాతం 8.1 మిల్లీమీటర్లుగా నమోదైంది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి వరకు పలు విడతలుగా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో వర్షం కురుస్తూనే ఉంది. దీంతో జిల్లాలోని గుండేరు, లజ్జబండ, వడ్లమన్నాడు, ఉప్పుటేరు తదితర డ్రెయిన్‌లు పొంగి ప్రవహిస్తున్నాయి.

దాళ్వాకు నీరివ్వండి

(5వ పేజీ తరువాయి)

పనులు దొరుకుతాయని వివరించారు. పెడన నియోజకవర్గంలోని సాగునీటి సంఘాల అధ్యక్షులు, రైతులు దాళ్వా పంటకు సాగు నీటిని విడుదల చేయాలని కోరుతున్నారని కూడా కలెక్టర్ తెలిపారు. దాళ్వా పంటకు సాగు నీటిని విడుదల చేస్తే జనవరి నుంచి ఏప్రిల్ వరకు తీర ప్రాంతంలోని మండలాల్లో తాగునీటి ఇబ్బందులు కూడా తప్పుతాయన్నారు. అనంతరం రైతులు, సాగునీటి సంఘాల అధ్యక్షులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంత్రులు నిమ్మల రామానాయుడు, కొల్లు రవీంద్రతో ఈ విషయంపై మాట్లాడి సముచిత నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, దాళ్వా సాగుకు బంటుమిల్లి ప్రధాన కాల్వ ద్వారా నీరు అందించాలని పలువురు రైతులు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు నాగేశ్వరరావుపేటలోని ఆయన నివాసంలో అర్జీ అందజేశారు.

నిర్లక్ష్యంతోనే కృష్ణాజలాలు సముద్రం పాలు

» ఏబీ వెంకటేశ్వరరావు



గాంధీనగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం, అలసత్వంతో ఈ ఏడాది వెయ్యి టీఎంసీల కృష్ణానదీ జలాలు వృథాగా సముద్రంలో కలిశాయని ఆలోచనపరుల వేదిక సభ్యుడు, మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు విమర్శించారు. ప్రజలు, వ్యవసాయం, రాష్ట్రాభివృద్ధికి అవసరమయ్యే ప్రాజెక్టులపై కాకుండా అసంబద్ధమైన పోలవరం-బనకచర్ల వంటి ప్రాజెక్టులపై ప్రభుత్వాలు దృష్టి సారిస్తున్నాయని ధ్వజమెత్తారు. ప్రముఖ విశ్రాంత ఇంజనీర్ సుబ్బరాయుడు సంస్మరణ సభ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగింది. తొలుత ఆయన చిత్రపటానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, జాగ్రఫీని మార్చడం, ప్రకృతిని అంచనా వేయడం ఎవరివల్ల కాదన్నారు. నదుల నుంచి వచ్చే నీటిని సరైన ఆలోచనతో ఒడిసిపట్టుకోవచ్చన్నారు. తద్వారా వ్యవసాయ స్థిరీకరణ సాధ్యమవుతుందన్నారు. సుబ్బరాయుడు రాష్ట్రం పట్ల నిబద్ధత కలిగిన వ్యక్తి అని కొనియాడారు. పలువురు వక్తలు మాట్లాడుతూ, సుబ్బరాయుడు పదవీ విరమణ చేసిన 20 ఏళ్ల తర్వాత కూడా రాయలసీమ కరవు కాటకాలకు శాశ్వత పరిష్కారానికి అంకితభావంతో కృషి చేశారన్నారు.

ఘర్షణలో మరణిస్తే ప్రజల సొమ్ము దానం చేస్తారా?

ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవలో మరణించిన వ్యక్తికి ప్రజల సొమ్మును దానం చేసే అధికారం ప్రభుత్వానికి ఎవరిచ్చారని వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. కులాల గొడవలతో కొట్టుకు చస్తే ఎకరాలకు ఎకరాల భూమి, లక్షలకు లక్షలు ఇచ్చేస్తారా అని ధ్వజమెత్తారు. ఇవ్వాలనుకుంటే వారి సొంత ఆస్తులు ఇవ్వాలని సూచించారు. కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కొండెక్కిన ఇసుక ధరలు

(5వ పేజీ తరువాయి)

దూరాభారాన్ని దళారులు తమకు అనుకూలంగా మలుచుకుని లోడు ఒక్కింటికి రూ.20 వేలకుపైగా ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. దీంతో ఏ చిన్న నిర్మాణాన్ని ప్రారంభించాలన్నా తడిసి మోపెడు కావటంతో సగటు వినియోగదారుడు తన పనులను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాల్సి పరిస్థితి నెలకొంది. ఆగస్టు నుంచి ఇదే పరిస్థిత కొనసాగుతుండటంతో నిర్మాణాలు నిలిచిపోయి నిర్మాణ రంగంపై ఆధారపడిన వందలాది మంది భవన నిర్మాణ కార్మికులు, ఇతర అనుబంధ వృత్తులవారు ఉపాధి లేక అల్లాడిపోతున్నారు.

లోడింగ్ పేరుతో క్వారీల్లో నయా దోపిడీ

ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలులోకి తీసుకురావటంతో క్వారీలను దక్కించుకున్న కాంట్రాక్టర్లు లోడింగ్ పేరుతో ఎగబడుతున్నారని, దీంతో విధిలేని పరిస్థితిలోనే తాము ధరలు పెంచి వినియోగదారులకు ఇసుక సరఫరా చేయాల్సి వస్తుందని లారీ యజమానులు పేర్కొంటున్నారు. క్వారీల్లో లోడింగ్ కోసం ఎక్స్‌కవేటర్ బక్కెట్ ఒక్కింటికి రూ.750 చార్జ్ చేస్తుండటంతో లోడు వేసినందుకు కనీసంగా రూ.7,500 నుంచి రూ.12 వేల వరకు లారీ యజమానులు క్వారీలో లోడింగ్ కోసమే చెల్లించాల్సి వస్తుందని చెబుతున్నారు. దీనికి రవాణా ఖర్చులు, తమ లాభాన్ని కలుపుకోవటంతో రూ.20 వేలకుపైగా చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తుందని వినియోగదారులు వాపోతున్నారు. వైసీపీ హయాంలో టన్ను ఒక్కింటికి రూ.375 వసూలు చేయగా, నేడు లోడింగ్ చార్జీల పేరుతో అంతే మొత్తాన్ని క్వారీ నిర్వాహకులు తమ దగ్గర నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తప్పులతడక

(5వ పేజీ తరువాయి)

చేశారు. దీనిని బట్టి చూస్తే ఎన్‌హెచ్ డేటాకు, రెవెన్యూ యంత్రాంగాలు పంపిన 3ఏ ప్రతిపాదనలకు సంబంధించి తేడాలు వచ్చాయి. అలైన్‌మెంట్ ప్రాతిపదికన తమ దగ్గర ఉన్న డేటాతో సరిపోలకపోవటంతోనే వాటిని సరిచేయాల్సిందిగా ఎన్‌హెచ్, రెవెన్యూ యంత్రాంగాలకు వెనక్కి పంపారు. ఇలాంటి 3ఏ ప్రతిపాదనలను తక్షణం ఆమోదిస్తే కోర్టు కేసులను ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. దీంతో ప్రస్తుతం రెండు జిల్లాల యంత్రాంగాలు ఈ తప్పులను గుర్తించే పనిలో పడ్డాయి.

ఆర్థిక ప్రతిపాదనలు పీపీపీఏసీకి..

అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డుకు సంబంధించి రూ.24 వేల కోట్ల అంచనాతో కూడిన ఆర్థిక ప్రతిపాదనలు ఎన్‌హెచ్ జాతీయ ఉన్నతాధికారుల నుంచి కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ (మోర్త్)కు చేరాయి. మోర్త్ ఆమోదం కూడా లభించింది. ప్రస్తుతం ఆ ప్రతిపాదనలు ప్రైవేట్ అండ్ పబ్లిక్ పార్టనర్‌షిప్ అప్రైజల్ కమిటీ (పీపీపీఏసీ)కి వెళ్లాయి. అక్కడి నుంచి ఆమోదం వచ్చాక కేంద్ర క్యాబినెట్‌కు వెళ్తాయి. అక్కడ కూడా ఆమోదముద్ర వేశాక అధికారిక గజిట్ నోటిఫికేషన్ వెలువడుతుంది. ఈ ప్రక్రియ పూర్తి కావటానికి ఐదారు నెలలకు పైగా పట్టే అవకాశం ఉంది.

40 శాతం నిధులు ఇవ్వనున్న కేంద్రం

అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డును హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో తలపెడుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 40 శాతం నిధులు ఇస్తుంది. ప్రాజెక్టు పూర్తిచేయాల్సిన మూడేళ్లలో కాంట్రాక్టు సంస్థకు ఆ నిధులు అందిస్తుంది. రూ.24 వేల కోట్ల అంచనా వ్యయంలో రూ.5 వేల కోట్లు భూ సేకరణకు అవసరం. భూ సేకరణ వ్యయంలో రూ.1,000 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం భరించాలి. మిగిలిన రూ.4 వేల కోట్లను కేంద్ర ప్రభుత్వమే ఇస్తుంది. మిగిలిన రూ.19 వేల కోట్లలో 40 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం మూడేళ్లలో దశలవారీగా కాంట్రాక్టు సంస్థకు చెల్లిస్తుంది. మిగిలిన 60 శాతం నిధులను ఆ తర్వాత 15 ఏళ్లలో చెల్లిస్తుంది. టోల్‌గేట్ల నిర్వహణ వంటివి కాంట్రాక్టు సంస్థతో సంబంధం లేకుండా ఎన్‌హెచ్ అధికారులే స్వయంగా చేపడతారు.

ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

» ది విజయవాడ వర్కింగ్ జర్నలిస్ట్ కో-ఆపరేటివ్ హౌస్ సొసైటీ

విజయవాడ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వమే ఇళ్ల నిర్మాణం చేసి ఇవ్వాలని 'ది విజయవాడ వర్కింగ్ జర్నలిస్ట్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ' ప్రతినిధులు కోరారు. నగరంలోని బాలోత్సవ్ భవన్‌లో బుధవారం సొసైటీ అత్యవసర సమావేశం జరిగింది. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ ప్రభుత్వం 2019లో జారీచేసిన 377 జీవో ప్రకారం.. విజయవాడ రూరల్ మండలంలోని నున్న గ్రామంలో సొసైటీకి కేటాయించిన స్థలంలో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ పర్యవేక్షణలో గృహ నిర్మాణ శాఖ ద్వారా పాత్రికేయులకు ఇళ్ల నిర్మాణం చేసి ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ సమావేశంలో తీర్మానం చేశారు. రాష్ట్ర ప్రజల సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తున్న కూటమి ప్రభుత్వం జర్నలిస్టులు సుదీర్ఘకాలంగా పోరాడుతున్న ఇళ్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇదే విషయమై పలుమార్లు అసెంబ్లీలో ప్రస్తావించిన గన్నవరం ఎమ్మెల్యే, విప్ యార్లగడ్డ వెంకట్రావుకు, పాత్రికేయుల ఇళ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన మంత్రులు కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్‌లకు జర్నలిస్టులు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో గృహ నిర్మాణాలపై త్వరలో జరగనున్న మంత్రి వర్గ సమావేశంలో తమ సమస్యలపై చర్చించి సానుకూల నిర్ణయం తీసుకోవాలనాలని సీఎం చంద్రబాబును కోరారు. సతీష్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సొసైటీ సీఈవో వెంకట్రావు, డైరెక్టర్లు, పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ అర్జీలు పరిష్కరించండి : కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) అర్జీలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్, అందరికీ ఇళ్లు అనే అంశాలపై భూ పరిపాలన శాఖ ప్రధాన కమిషనర్ జి.జయలక్ష్మి బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ ఇలక్కియాతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ అర్జీల్లో అపరిష్కృతంగా ఉన్న వాటి వివరాలు శాఖల వారీగా, మండలాల వారీగా తెలియజేయాలన్నారు. అర్జీల పరిష్కార విషయంలో అలసత్వం చూపరాదని, త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కీలక ప్రగతి సూచికల్లో (కేపీఐ) ఐసీడీఎస్, పోలీసు శాఖల అంశాలలో పురోగతి ఉండాలన్నారు. ఈ క్రాప్ నమోదు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. డీఆర్‌వో ఎం లక్ష్మీ నరసింహం, కేఆర్ఆర్‌సీ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎ.పోసిబాబు, జిల్లా వ్యవసాయ అధికారి విజయకుమారి, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జీ జ్యోతి, డీఎస్ఎల్‌వో వై మోహన్‌రావు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి

» ఇంజనీరింగ్ అధికారులకు ఈవో ఆదేశం

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి పనులను త్వరిగతిన పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తేవాలని దేవస్థానం ఈవో వీకే శీనానాయక్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. భవానీదీక్ష విరమణల సమయానికి ఏమేరకు ప్రధాన అభివృద్ధి పనులు అందుబాటులో ఉంటాయో తెలియజేయాలని ఈవో అధికారులను కోరారు. బుధవారం ఈవో తన చాంబర్‌లో ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణతో కలిసి అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం



అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష చేస్తున్న ఈవో శీనానాయక్

నిర్మాణం జరుగుతున్న నూతన అన్నప్రసాద భవనం, లడ్డూ పోటు భవనం, ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్ పనులు ఏమేరకు జరుగుతున్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పనులు ఎప్పటిలోగా పూర్తి అవుతాయో సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి లిఖితపూర్వకంగా తెలియపరచాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులు దేవదాయశాఖ కమిషనర్ నివేదిక పంపాలని ఆదేశించారని వివరించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు రాక పెరుగుతున్న నేపథ్యంలో భక్తులకు కావాల్సిన కనీస మౌలిక వసతులు, సదుపాయాలు మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. త్వరలో దేవదాయ శాఖ మంత్రి, కమిషనర్ సమీక్ష నిర్వహించనున్నారని, ఆ సమయానికి అన్ని అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఈఈలు కోటేశ్వరరావు, రాంబాబు, ఏసీ రంగరావు, ఏఈ రంగారావు, ఏఈఓలు బి.వెంకటరెడ్డి, ఎన్.రమేష్‌బాబు, చంద్రశేఖర్, సుధారాణి, శ్రీనివాస్, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

క్యూలో భక్తుడికి పాముకాటు

» జీజీహెచ్‌కి తరలించిన సిబ్బంది

» ప్రమాదం లేదని చెప్పిన వైద్యులు

» ఊపిరిపీల్చుకున్న కుటుంబసభ్యులు

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మను దర్శించుకోవటానికి విచ్చేసి ఉచిత క్యూలో నిలబడి ఉన్న బాపట్ల జిల్లాకు చెందిన యువకుడిని (25)ని పాము కాటు వేసిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఆలయ సిబ్బంది భక్తుడిని హుటాహుటిన దేవస్థానం అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో భక్తులు భయభ్రాంతులకు గురయ్యారు. వివరాల మేరకు.. బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన శ్రీనివాసరావు కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారి దర్శనానికి వచ్చాడు. ఎనిమిది మందితో కొండపైన డోనర్ సెల్ సమీపంలో ఉచిత క్యూలో నిలబడి ఉండగా.. శ్రీనివాసరావును పాము కాటు వేయటంతో భయభ్రాంతులకు గురయ్యారు. అదే సమయంలో దిగువ నుంచి కొండపైకి వచ్చిన దేవస్థానం అంబులెన్స్‌లో ఆలయ సిబ్బంది, ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు శ్రీనివాసరావును హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయాన్ని దేవస్థానం ఉన్నతాధికారులకు తెలియజేశారు. వైద్యులు శ్రీనివాసరావును పరీక్షించి ఎటువంటి ప్రమాదం లేదని చెప్పటంతో కుటుంబసభ్యులు, దేవస్థానం సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. కరిచిన పాము విషసర్పం కాదని వైద్యులు చెప్పారు. శ్రీనివాసరావుకు చికిత్సచేసి కుటంబ సభ్యులకు అప్పగించారు. కాగా, క్యూలోకి రెండుమూడు పాములు వచ్చినట్టు పలువురు భక్తులు తెలిపారు.

కోళ్లు కొట్టేస్తున్నారు..!

(5వ పేజీ తరువాయి)

చేస్తుంటారు. ఇందుకోసం గ్రామ శివారుల్లో, తోటల్లో మినీ ఫౌల్ట్రీలు నిర్వహిస్తుంటారు. ఈ పుంజులు ఎక్కడికీ పారిపోకుండా చుట్టూ ఇనుపకంచెను ఏర్పాటు చేసి మధ్యలో వాటిని ఉంచుతారు. అక్కడే పౌష్టికాహారం ఇస్తుంటారు. ఎన్టీఆర్ జిల్లాలో ఉన్న గొర్రెలు, మేకలను, కృష్ణాజిల్లాలో కోడిపుంజులను ఈ స్టూవర్టుపురం దొంగలు మాయం చేస్తున్నారు. కోడిపుంజుల చుట్టూ ఉన్న ఇనుపకంచెను కట్టర్లతో కట్‌చేసి వాటిని ఎత్తుకుపోతున్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు

కొద్దిరోజుల క్రితం జగ్గయ్యపేట పోలీసులు అర్ధరాత్రి వాహన తనిఖీలు చేస్తుండగా, ఐదారుగురు స్టూవర్టుపురం దొంగలు వ్యాన్‌లో గొర్రెలతో వెళ్తున్నారు. దీన్ని గమనించిన పోలీసులు వాహనాన్ని ఆపి అందులో ఉన్న యువకులను ప్రశ్నించారు. పోలీసులు వివరాలు తీసుకుంటుండగా వారు పరారయ్యారు. పారిపోతున్న మరో యువకుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి దొంగిలించిన గొర్రెలు, మేకలు, కోడిపుంజులను గుంటూరు జిల్లాకు తీసుకెళ్లి తెల్లవారుజామున జరిగే సంతలో విక్రయిస్తున్నారు. ఒక గొర్రె రూ.లక్ష విలువ చేస్తే దాన్ని సగంధరకు విక్రయిస్తున్నారు. కోడిపుంజులను వేలాది రూపాయలకు అమ్మేస్తున్నారు. అర్ధరాత్రి దొంగిలించిన పశుసంపదను వెంటనే సరిహద్దులు దాటించి సంతలో అమ్మేస్తున్నారు. తర్వాత మళ్లీ వేటకు వస్తున్నారు. పోలీసులకు చిక్కిన యువకుడ్ని ప్రశ్నించడం ద్వారా ప్రధాన నిందితులను పట్టుకునేందుకు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే అసలు నిందితులు ఎవరన్నది పోలీసులు గుర్తించారు.

బస్ స్టేషన్‌లో కొమరం భీమ్ జయంతి వేడుకలు

బస్‌స్టేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ ప్రాంగణంలో బుధవారం ఏపీఎస్ఆర్టీసీ జైభీమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొమరం భీమ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.కిరణ్ బుజ్జి, రాష్ట్ర కోశాధికారి ఎస్.ఎల్.రావు కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి అసోసియేషన్ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	137, 146, 157
చికెన్ విత్ స్కిన్	264
చికెన్ స్కిన్‌లెస్	274
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560	



నేటి నుంచి పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు

ఉంగుటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆధార్ అప్‌డేట్ చేయని పిల్లలకోసం గురువారం నుంచి 30వరకు ప్రభుత్వపాఠశాలలు, కళాశాలల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక బయోమెట్రిక్ ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఇ.సత్యకుమార్ తెలిపారు. బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ పాఠశాల అడ్మిషన్లు, జేఈఈ, నీట్ వంటి ప్రవేశపరీక్షలు, స్కాలర్‌షిప్, ప్రత్యేక ప్రయోజన బదిలీ పథకాలకు ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. 23న పెదఅవుటపల్లి సెయింట్ జార్జి హైస్కూల్, ఉంగుటూరు జయరామ విజ్ఞాన విహార్ స్కూల్, మానికొండ జడ్పీహైస్కూల్‌లో, 24న లంకపల్లి ఎంపీయూపీ స్కూల్, 25న పెదఅవుటపల్లి జడ్పీహైస్కూల్, ఇందుపల్లి థెరిస్సా అకాడమీ, ఉంగుటూరు జడ్పీహైస్కూల్, 27న ఆత్కూరు సెయింట్ ఆంతోని హైస్కూల్, 28న ఆత్కూరు జడ్పీహైస్కూల్, 29న పొట్టిపాడు బెస్ట్ పబ్లిక్ స్కూల్, 30న తేలప్రోలు జడ్పీహైస్కూల్‌లో ప్రత్యేక ఆధార్ అప్‌డేట్ ఉచిత క్యాంపులు జరుగుతాయని ఎంపీడీవో వివరించారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు

పీవీపీ సిద్ధార్థలో ఫ్రెషర్స్ డే

కానూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కానూరులోని పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే ఘనంగా జరిగింది. ఈసందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు అకట్టుకున్నాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన కళాశాల ప్రిన్సిపాల్ కొండపల్లి శివాజీబాబు మాట్లాడుతూ ఉత్తమమైన బోధనావసరులు, ఆచరణ్మాక అనుభవం, విద్యార్థులకు సరైన శిక్షణ అందిస్తామని తెలిపారు.



ప్రజల సమస్యలు సత్వరం పరిష్కరించాలి

● ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న చిన్నచిన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులను ఆదేశించారు నియోజకవర్గంలో బుధవారం సుడిగాలి పర్యటన చేసి అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ నాయకులను పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనారోయంతో బాధపడుతున్న వీరపనేనిగూడెం గ్రామానికి చెందిన టీడీపీ నేత ఉయ్యూరి శ్రీరామిరెడ్డిని పరామర్శించారు. బాపులపాడు మల్లవల్లిలో యనమదల వెంకయ్యారావును పరామర్శించారు. కొత్తపల్లి గ్రామం ఇటీవల మరణించిన షేక్ బషీర్ కుటుంబాన్ని పరామర్శించారు. అంపాపురంలో అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ నేత గోగినేని శివరామకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. పెద్దావుటపల్లిలో ఇటీవల మృతి చెందిన వేగే శివయ్య, పవన్‌కుమార్ కుటుంబాలను పరామర్శించారు. . రాష్ట్ర మాల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్ దయాల రాజేశ్వరరావు, కాగితం నాగరాజు, అట్లూరి శ్రీనివాసరావు,మొవ్వా వేణుగోపాల్, కొండేటి వెంకటేశ్వరరావు, వెంకటకృష్ణ, అన్నే హరికృష్ణ, తదితరులు ఉన్నారు.



అంపాపురంలో శివరామకృష్ణ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

సామాజిక సేవలో ప్రజల భాగస్వామ్యం అవసరం

● మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాలవర్ధనరావు

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆర్థిక స్తోమత ఉన్నవారు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని మాజీ ఎమ్మెల్యే, విజయ డెయిరీ డైరక్టర్ దాసరి వెంకటబాలవర్ధనరావు పిలుపు ఇచ్చారు. స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్ జన్మదినం పురస్కరించుకొని ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దాసరి వెంకట బాలవర్ధనరావు ముఖ్య అతిథిగా పాల్గొని చిరు వ్యాపారాలకు టీస్టాల్, టిఫిన్ బండి, తోపుడు బండ్లను అందజేశారు. మురికివాడల్లో నివసించే మరో 80 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. బాపులపాడు జడ్పీ హైస్కూల్ ఇంటర్ విద్యార్థులకు కెమికల్ ల్యాబ్ పరికరాలు అందజేశారు. అనంతరం ఇటీవల కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శిగా నియమితులైన ఎంఈవో -2 కొమ్మా విజయ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరక్టర్ రమాచనేని శ్రీదేవి, సభ్యులు కడగల శ్రీనివాసరావు, వీరమాచనేని బుజ్జి, ముత్యాల సువర్ణరాజు, జాస్తి భూపతి,విశ్రాంతి వ్యాయామ ఉపాధ్యాయులు అక్కినేని రాఘవేంద్రరావు, బాపులపాడు,రేమల్లె హైస్కూల్ హెచ్‌ఎంలు శ్రీనివాసరావు, లూదర్‌పాల్ పాల్గొన్నారు.



తోపుడు బండ్లు పంపిణీ చేసే కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాలవర్ధనరావు

152 మందికి రోగ నిర్ధారణ పరీక్షలు

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జంక్షన్ బైపాస్ సమీపంలోని మెడీవ్యాలీ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో బుధవారం కాలేయానికి సంబంధించి ఉచిత రోగ నిర్ధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆసుపత్రి ఎండీ పంచకర్ల రమేష్ చక్రవర్తి ఆధ్వర్యంలో 152 మందికి పరీక్షలు జరిపారు. వైద్యులు నిహారిక సేవలందించారు. డైరక్టర్ డాక్టర్ పి.సుధ పర్యవేక్షించారు. .హనుమాన్‌జంక్షన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 29న మెడీవ్యాలీ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రమేష్ చక్రవర్తి తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణలకు నాంది

కానూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఎంటర్‌ప్రూనర్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణలకు నాంది ఏర్పడుతుందని సీటీఐడీ సబ్ సెంటర్(విజయవాడ) ట్రెనింగ్ ఆఫీసర్ పి.చంద్రశేఖర్ అన్నారు. కానూరులోని పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జరిగిన ఎంటర్‌ప్రూనర్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థుల ఆలోచనలు కార్యరూపం దాల్చేందుకు అవసరమైన సామర్థ్యాన్ని ఈ కార్యక్రమాలు అందిస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల బిజినెస్ అడ్మిన్‌స్ట్రేషన్ విభాగాధిపతి డాక్టర్ పి. ఆదిలక్ష్మి, మాస్టర్ ట్రైనర్ గుమ్మడి శివన్నారాయణ, సర్టిఫైడ్ ట్రెనర్ చింతల రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తమాలజిస్ట్ కొండలరావు

ఉంగుటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పిల్లల్లో దృష్టిలోప సమస్యలను నివారించడంలో తల్లిదండ్రులకు నిర్లక్ష్యం తగదని, సకాలంలో గుర్తించి చికిత్స చేయించాలని ఆత్కూరు జడ్పీహైస్కూల్ హెచ్‌ఎం పి.రాధికారాణి అన్నారు. 6 నుంచి 18సంవత్సరాల వయసుగల పాఠశాల విద్యార్థుల్లో దృష్టిలోప సమస్యల నివారణకై ప్రభుత్వం చేపట్టిన నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ కంట్రోల్ ఆఫ్ బ్లైండ్‌నెస్(ఎన్‌పీసీబీ)కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆత్కూరు జడ్పీహైస్కూల్‌లో కంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వీరవల్లి పీహెచ్‌సీ ఆప్తమాలజిస్ట్ కొండలరావు ఆధ్వర్యంలో సుమారు 287మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 35మందికి దృష్టిలోప సమస్యలున్నట్లు గుర్తించి కళ్లజోళ్లకు సిఫారసు చేశారు. ఆత్కూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు తరచుగా కంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా కంటిచూపును పరిరక్షించుకోవాలన్నారు. సెల్‌ఫోన్లకు దూరంగా వుంటూ, ఆకుకూరలు, ప్రోటీన్లు అధికంగా వున్న పోషకాహారం తీసుకోవడం ద్వారా కళ్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆత్కూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ టి.జితేంద్రకుమార్, ఏఎన్‌ఎం కె.కృష్ణవేణి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కోశాధికారిగా నూకల

ఉయ్యూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కోశాధికారిగా సుధీర్ టింబర్ డిపో అధినేత నూకల సాంబశివరావు నియమితులయ్యారు. మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో జరిగిన రాష్ట్ర విభాగ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలోసాంబశివరావుతో పాటు ప్రధాన కార్యదర్శి కనమర్లపూడి హరిప్రసాదరావు, అదనపు కార్యదర్శి వేణుగోపాలశ్రే ష్టితో మహాసభ గ్లోబల్ అధ్యక్షుడు తంగుటూరి రామకృష్ణ ప్రమాణం చేయించారు. మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్, రాష్ట్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ హాజరై కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూకల సాంబశివరావు

శివ నామస్మరణలో ఆలయాలు



ఉయ్యూరు శివాలయంలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బాపులపాడు మండలంలోని శివాలయాల్లో కార్తీక మాస పూజలు బుధవారం వైభంగా ప్రారంభమయ్యాయి. ఆలయాల్లో శివ నామస్మరణ మార్మోగింది. బాపులపాడు శ్రీభ్రమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జున స్వామి దేవస్థానంలో స్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆకాశదీపం వెలిగించి శంభో శంకరుడిని ప్రార్థించారు. పెరికీడు ముక్తికాంత సమేత ముక్తేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అభిషేకాలు జరిపి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. చిరివాడ, కానుమోలు, వీరవల్లి శివాలయాల్లో కార్తీక మాసం పూజలు జరిగాయి.

ఉయ్యూరు: కార్తీకమాసం ప్రారంభం పురస్కరించుకుని బుధవారం మండలంలోని శివాలయాల్లో భక్తుల సందడి కన్పించింది. వేకువజాము నుంచి భక్తులు ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు. శ్రీజగదాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు దీపారాధనలు చేసి పూజలు చేశారు. పెదఓగిరాల, చినఓగిరాల, ఆకునూరు, కలవపాముల, కడవకొల్లు, ముదునూరు గ్రామాల్లో భక్తులు పూజలు చేశారు.

కంప్యూటర్ టేబుళ్ల వితరణ

ఉంగుటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల విజ్ఞానాభివృద్ధికి దోహదపడుతున్న గ్రంథాలయాల అభివృద్ధిలో దాతలు భాగస్వాములవడం అభినందనీయమని ఎంఈవో-2 జె.సాంబశివరావు అన్నారు. ఉంగుటూరుకు చెందిన దాత పొట్లూరి రామ్‌కుమార్ స్థానిక గ్రంథాలయానికి బుధవారం రెండు కంప్యూటర్ టేబుళ్లు బహూకరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి యు.చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వృద్ధురాలికి వీల్‌చైర్..

అనారోగ్యంతో బాధపడుతూ నడవలేని స్థితిలో వున్న నాగవరప్పాడుకు చెందిన లంకా పెద్దబాబు తల్లికి పీఆర్‌కే ఫౌండేషన్ ఛైర్మన్ పారా రామకృష్ణ బుధవారం వీల్‌చైర్ అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నిడమర్తి నాగేశ్వరరావు, సత్యనారాయణ(చిన్నబాబు) తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వర్షంతో ఇక్కట్లు

గన్నవరం: మండలంలో ఎడతెరిపి లేకుండ కురుస్తున్న వర్షంతో పలు అంతర్గత మట్టిరోడ్లు బురదకయ్యగా మారాయి. బుధవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గన్నవరం, తెంపల్లి, బల్లిపర్రు, వీరపనేనిగూడెం, కొత్తగూడెం, చిక్కవరం, గొల్లనపల్లి, గోపవరపుగూడెం, కొండపావులూరు, పురుషోత్తపట్నం, వీఎన్‌పురం కాలనీలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఎస్‌జీఎఫ్ డివిజన్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఉయ్యూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ డివిజన్ స్థాయి అండర్-14, 17 బాల, బాలికల షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా జట్ల ఎంపిక పోటీలను డీవైఈవో పద్మారాణి బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల పట్ల అనక్తి కనపరచి ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలన్నారు. ఎంఈవో-2 ఎన్. సుధారాణి, జడ్పీస్కూల్ హెచ్‌ఎం టీవీ నాగేశ్వరరావు, డివిజన్ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులు త్వరలో జిల్లా స్థాయి సెలక్షన్‌లో పాల్గొంటారని డివిజన్ కో-ఆర్డినేటర్ కంచర్ల బాలస్వామి తెలిపారు.

ఎయిర్ పిస్టల్ షూటింగ్ టోర్నమెంట్‌కు సిద్ధార్థ వర్సిటీ విద్యార్థులు

కానూరు: పంజాబ్‌లోని గురు కాశీవిశ్వవిద్యాలయంలో ఈనెల 24నుంచి 29వ తేదీ వరకు జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ ఎయిర్ పిస్టల్ షూటింగ్ టోర్నమెంట్‌కు కానూరు సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థులు ప్రాతినిధ్యం వహించనున్నారు. బీటెక్ రెండో సంవత్సరం చదివే విద్యార్థి పి. త్రినాథ్ చౌదరి పురుషుల విభాగం, కె. పూజిత మహిళల విభాగంలో ఎయిర్ పిస్టల్ షూటింగ్ పోటీలకు హాజరవుతున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

లయన్స్ క్లబ్ సేవలు విస్తృత పరచాలి

కంకిపాడు : లయన్స్ క్లబ్ సేవలను విస్తృత పర్చాల్సిన అవసరముందని లయన్స్ క్లబ్ కంకిపాడు మాజీ అధ్యక్షుడు బండి జ్యోతి అన్నారు. బస్టాండ్ వద్ద బుధవారం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బండి జ్యోతి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవలనుమండలంలో విస్తృతపరుస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో క్లబ్ కంకిపాడు అధ్యక్షుడు యుగంధర్, ప్రతినిధులు బండి నాంచారయ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కాటూరులో సాయిబాబా మందిరం వద్ద ప్రధాన రహదారిపై విరిగి పడిన విద్యుత్ స్తంభం

విరిగి పడిన విద్యుత్ స్తంభం.. ట్రాఫిక్‌కు అంతరాయం

ఉయ్యూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాటూరులో బుధవారం వర్షంతోపాటు వీచిన ఈదురుగాలులకు సాయిబాబా మందిరం వద్ద ప్రధాన రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభం విరిగి పడింది. దీంతో ట్రాఫిక్ అంత రాయంతో పాటు, గ్రామంలో అంధకారం నెలకొంది. స్థానికులు కరెంటు తీగల వల్ల ఏదైనా ప్రమాదం జరుగుతుందని భయంతో అధికారులకు సమాచారం అందించారు. సిబ్బంది అక్కడకు చేరుకుని లైన్ కనెక్షన్ తప్పించారు. తీగలు రోడ్డుకు అడ్డంగా పడడంతో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు కొంతసేపు అంతరాయం ఏర్పడింది.



దుర్గాఘాట్‌లో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

కృష్ణానదిలో భక్తుల పుణ్యస్నానాలు

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా తొలిరోజు బుధవారం దుర్గాఘాట్ కృష్ణానదిలో భక్తులు భక్తిశ్రద్ధలతోనే పుణ్యస్నానాలాచరించారు. అనంతరం దేవస్థానం ప్రాంగణంలోని మల్లేశ్వరస్వామిని, వన్‌టౌన్ శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం(పాత శివాలయం)లో స్వామిని దర్శించుకున్నారు. దుర్గగుడి అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఘాట్‌లో భద్రతా చర్యలు తీసుకున్నారు. కృష్ణానదిలో వరద నీరు ఎక్కువగా ఉండటంతో భక్తులను నదిలోకి వెళ్లనీయకుండా ప్రత్యేక బారికేడ్లను ఏర్పాటు చేసి గజ ఈతగాళ్లను నియమించారు. దీంతో భక్తులు జల్లుస్నానాలు ఆచరించారు.

ఎన్ఐటీటీటీఆర్ సెంటర్
నిర్మాణానికి వేగంగా అడుగులు

● పాలిటెక్నిక్ కాలేజీ ఆవరణలో నిర్మాణానికి సన్నాహాలు

విజయవాడ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెన్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ (ఎన్ఐటీటీటీఆర్) ఏపీ ఎక్స్‌టెన్షన్ సెంటర్ నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. ప్రతిష్ఠాత్మకమైన ఈ కేంద్రాన్ని రాష్ట్రంలో నెలకొల్పేందుకు చెన్నైలోని ఎన్ఐటీటీటీఆర్ డైరెక్టరేట్ రెండేళ్ల క్రితమే అనుమతిచ్చింది. ఈ నేపథ్యంలో ఈ సెంటర్ నిర్మాణానికి అనువైన స్థలం కోసం కొన్నాళ్ల పాటు అన్వేషణ జరిగింది. విజయవాడ నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఆవరణలో ఈ సెంటర్ ఏర్పాటు చేయాలని, దానికి అనుగుణంగా నూతన శాశ్వత భవనాన్ని నిర్మాణం చేయాలని ప్రభుత్వం భావించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ ఎన్ఐటీటీటీఆర్ సెంటర్ నూతన భవన నిర్మాణానికి 6వేల చదరపు అడుగుల కావాల్సి ఉంటుందని అంచనా వేశారు. దీనికి స్థలం సమకూర్చే పనిని విజయవాడ తూర్పు మండల తహసీల్దార్‌కు అప్పగించారు. పాలిటెక్నిక్ కాలేజీలోని 5/6 సర్వే నెంబర్‌లో ఆరు సెంట్లు, 6/3 సర్వే నెంబర్‌లో ఏడున్నర సెంట్ల ప్రభుత్వ భూమి ఉందని తహసీల్దార్ కార్యాలయ అధికారులు గుర్తించారు. ఈ స్థలాలను పూర్తిగా సర్వే చేసి ఈ రిపోర్టును కలెక్టర్‌కు అందజేశారు. ఈ స్థలంపై ప్రజాభిప్రాయ సేకరణ, ఫిర్యాదుల కోసం గతంలోనే నోటీసులు జారీ చేశారు. నోటీసుల గడువు పూర్తయ్యాక ప్రస్తుత తరుణంలో కౌన్సిల్ ఆమోదం కోసం పంపారు. ఈ సెంటర్ ఏర్పాటు జరిగితే అందుబాటులోనే టెన్నికల్ టీచర్స్ ట్రైనింగ్ తీసుకునే అవకాశం యువతకు దక్కుతుంది.



కర్ణాటకలో పర్యటిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ప్రతినిధుల బృందం

ఏపీని డంప్ ఫ్రీ స్టేట్‌గా మారుస్తాం

● స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి

● కర్ణాటకలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ బృందం పర్యటన

విజయవాడ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని డంప్ ఫ్రీ స్టేట్‌గా మార్చే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. ఆయన నేతృత్వంలో కర్ణాటకలోని మంగుళూరు, దక్షిణ కన్నడ జిల్లాల్లో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ బృందం పర్యటించింది. అక్కడ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ పనితీరును ఈ బృందం స్వయంగా పరిశీలించింది. మంగుళూరు, దక్షిణ కన్నడ జిల్లాల్లోని ఎడపడవు, ఉజురే గ్రామ పంచాయతీల్లోని మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్‌లను, ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్స్ పనితీరును అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా పట్టాభి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని ఏపీలో పూర్తిగా నిరోధించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న రోజుల్లో 175 నియోజకవర్గాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్‌ల స్థాపనకు ప్రణాళికలు చేస్తామన్నారు.

క్రీడా అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

లబ్బీపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, క్రీడల విభాగం 2025 సంవత్సరానికి సంబంధించి అర్జున అవార్డు, రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహక్ పురస్కార్ నిమిత్తం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు శాప్ కార్యాలయం తెలిపింది. దరఖాస్తులు పూర్తిగా ఆన్‌లైన్‌లో మాత్రమే సమర్పించాలని, అవార్డు మార్గదర్శకాల ప్రకారం అర్హత ఉన్న వ్యక్తులు స్వయంగా ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేయాలని కార్యాలయం తెలిపింది. దరఖాస్తుల సమర్పణకు అక్టోబరు 28 చివరితేది అని తెలిపింది.

పాస్టర్‌పై పోక్సో కేసు నమోదు

కంచికచర్ల రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బాలికల పట్ల తరచూ వేధింపులు, అత్యాచారాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. తాజాగా మండల కేంద్రమైన కంచికచర్లలో ఓ బాలిక పట్ల ఏకంగా ఒక పాస్టర్ అసభ్యకరంగా ప్రవర్తించడం వెలుగు చూసింది. దీంతో పాస్టర్‌పై కంచికచర్ల పోలీస్ స్టేషన్లో పోక్సో కేసు నమోదైంది. కంచికచర్ల ఎస్ఐ విశ్వనాథ్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం స్థానిక న్యూ అంబేడ్కర్ కాలనీకి చెందిన 14ఏళ్ల బాలిక అదే కాలనీలో ఉంటున్న భట్టు సుధీర్‌కుమార్ అనే పాస్టర్ 6 నెలల క్రితం చర్చికి ప్రార్థనకు వచ్చిన సమయంలో అసభ్యకరంగా ప్రవర్తించినట్టు తెలిపారు. అప్పటి నుంచి బాలిక కనిపించినప్పుడల్లా బెదిరిస్తూ వేధిస్తున్నాడు. ఈ మేరకు బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పాస్టర్ సుధీర్‌కుమార్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వీబీసీ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు విమల కన్నుమూత



గొల్లపూడి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్త్రీ, శిశు సంక్షేమ శాఖ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్, వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు సూరపనేని విమల (87) సోమవారం ఉదయం హైదరాబాద్‌లో అనారోగ్యంతో కన్నుమూశారు. ఆమె భౌతిక కాయాన్ని విజయవాడ సమీపంలోని గొల్లపూడిలోని వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయానికి తరలించగా, పలువురు నివాళులర్పించారు. అనంతరం విమల ఆకాంక్షకు అనుగుణంగా ఆమె భౌతిక కాయాన్ని కృష్ణాజిల్లా గన్నవరం సమీపంలోని పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలకు అప్పగించారు. ఆమె తన విశ్రాంత జీవితమంతా సేవా కార్యక్రమాలకే అంకితం చేశారు. 2000లో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ లైబ్రరీ భవన నిర్మాణానికి తన సోదరుడితో కలిపి భూరి విరాళం అందజేశారు. రామవరప్పాడులో హోమియో ఆసుపత్రిని ప్రారంభించి ఉచిత వైద్య సేవలందించారు. వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్టు స్థాపించి, దివ్యాంగ విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహించి, బోర్డ్ ఎగ్జామ్స్ రాయించారు. మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రం నిర్వహించారు. బాలికలకు కరాటే శిక్షణ ఇప్పించారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు మనోహర్ నాయుడు, కే లక్ష్మయ్య, మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ, పెన్షనర్స్ అసోసియేషన్ నేతలు జీ ప్రభుదాస్, వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ వడ్లమూడి రామకృష్ణ విమల భౌతిక కాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు





ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సమక్షంలో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సాదం శ్రీనాథ్, మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొండా

విద్యాధరపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం 64వ డివిజన్ పరిధి కుందావారి కండ్రికలో ది విజయ కుందావారి కండ్రిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ కార్యాలయం వద్ద ఆ సంఘం నూతన చైర్మన్‌గా సాదం శ్రీనాథ్, డైరెక్టర్లుగా పొన్నం శేషగిరిరావు, దేవిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ప్రమాణ స్వీకారం జరిగింది. ముఖ్య అతిథిగా బొండా ఉమామహేశ్వరరావు హాజరై చైర్మన్, డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు భద్రత, భరోసా కల్పిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం 16 నెలల్లో రైతుల సంక్షేమానికి పలు అభివృద్ధి పనులు, పథకాలు అమలు చేస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రైతులు పండించి అమ్ముకున్న ధాన్యానికి డబ్బులు సకాలంలో ప్రభుత్వం చెల్లించకపోవటంతో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు రూ.1,250 కోట్ల ధాన్యం బకాయిలను రైతుల ఖాతాలలో జమచేసిందన్నారు. రైతన్న నేస్తం పథకం కింద ఎకరానికి రూ.20లు అందిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా తొలి విడతగా రూ.7వేలను ప్రభుత్వం రైతుల ఖాతాలలో జమచేసిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా యూరియా కొరత ఉన్నప్పటికీ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. సెంట్రల్ పరిధిలోని రైతులకు సకాలంలో యూరియా సరఫరా చేసి రైతులకు అండగా నిలిచామన్నారు. పాడి రైతులు, మహిళా రైతులు బ్రహ్మాండగా రాణిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన చైర్మన్, డైరెక్టర్లకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందచేసి అభినందనలు తెలిపారు. టీడీపీ 64వ డివిజన్ అధ్యక్షుడు కాకొల్లు రవికుమార్, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే బాబు, చైర్మన్, డైరెక్టర్ల కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, స్థానిక టీడీపీ నేతలు, వ్యవసాయ సహకార పరపతి సంఘం అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్.. పదిమందిపై కేసు



స్టేషన్ వద్ద ఉన్న సీజ్ చేసిన ట్రాక్టర్లు

తిరువూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు సాగిస్తున్న అక్రమ ఇసుక దందాను పోలీసులు అడ్డుకున్నారు. ఇసుకలోడుతో తెలంగాణకు వెళుతున్న ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని ట్రాక్టర్ యాజమానులతో పాటు, ఇసుక అక్రమ రవాణా చేస్తున్న పదిమందిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు ఎస్ఐ కేవీజీవీ సత్యనారాయణ బుధవారం తెలిపారు. ఇసుక అక్రమ రవాణ కేసులో అరెస్టు అయిన వారిని వదిలేయాలని, సీఐ కార్యాలయం వద్ద వైసీపీ నేతలు హల్‌చల్ చేశారు. వైసీపీకి చెందిన జిల్లాస్థాయి నేతతో పోలీసులపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేశారు.

ఈ ఘటనకు సబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏ కొండూరు మండలానికి చెందిన ఒక వైసీపీ నేత ఆధ్వర్యంలో ట్రాక్టర్లతో తెలంగాణ ప్రాంతానికి కొన్ని నెలలుగా ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నాడనే ఆరోపణలున్నాయి. మంగళవారం రాత్రి అక్కపాలెం మీదుగా తెలంగాణకు ఇసుక ట్రాక్టర్లు వెళుతుండగా, గ్రామస్థులు ట్రాక్టర్లను నిలిపేశారు. స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకునేలోగా, ట్రాక్టర్లను కల్లూరు పోలీసులు తమ స్టేషన్‌కు తరలించారు. అక్కడ నుంచి తిరువూరు పోలీసులు ట్రాక్టర్లను తిరువూరు స్టేషన్‌కు తరలించారు. దీనిపై సీఐ గిరిబాబు దర్యాప్తు చేపట్టారు. ట్రాక్టర్ యాజమానుల సెల్‌ఫోన్ కాల్‌డేటా ఆధారంగా, వీరు ఎవరికి ఫోన్లు చేశారు. ఎక్కడెక్కడ ఇసుక తోలకాలు చేశారు. వీరి వెనుక ఉన్న పెద్దలెవరనే విషయాలతో పాటుగా అధికార పార్టీకి చెందినవారు వారెవరైనా ఉన్నారా అన్నదానిపై దర్యాప్తు చేపట్టినట్టు సమాచారం.

పదిమంది అరెస్టు

ఇసుక అక్రమ రవాణా కేసులో అయిదు ట్రాక్టర్లు సీజ్‌తో పాటు ట్రాక్టర్ల డ్రైవర్లు, ఓనర్లు చిట్టిపోతు శ్రీను, పొదిలి గోపాలరావు, చిమట రామకృష్ణ, రాజబోయిన వెంకటేశ్వరరావు, కాలసాని వెంకటేశ్వరరావు, కఠారి దుర్గారావు, వలదాసి కిషోర్, తొట జయరామ్, చిట్టిపోతుల శివ, కాలసాని చెన్నారావుపై కేసు నమోదు చేశారు. కాగా ఇసుక అక్రమ రవాణ చేస్తున్న వైసీపీ నేతలు ఈ కేసు నుంచి బయటపడేందుకు, తమ పార్టీపెద్దల్ని రంగంలోని దింపే యత్నాలు చేశారు.

శంకరన్ ఆశయాలు శ్లాఘనీయం

● జయంతి సభలో వక్తలు



శంకరన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

గవర్నర్‌పేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో నెలకొన్న సామాజిక అసమానతలను రూపుమాపేందుకు ఉన్నతాధికారి హోదాలో ఎస్ఆర్ శంకరన్ తీసుకున్న నిర్ణయాలు నిర్మాణాత్మకమైన మార్పులకు కారణమయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఎన్నో చట్టాలను, పథకాలను రూపొందించిన ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ 91వ జయంతి బుధవారం లెనిన్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ ఐక్యతా భవన్‌లో జరిగింది. శంకరన్ కాంస్య విగ్రహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు ఎస్ఆర్ శంకరన్ మెమోరియల్ కమిటీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి విశేషమైన కృషి చేసిన అధికారిని స్మరించుకోవడం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు, తిరువూరు ఎమ్మెల్యే కొలకపూడి శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కాకి సునీత తదితరులు మాట్లాడుతూ ఉన్నతాధికారిగా శంకరన్ పేద ప్రజలకు అందించిన ఫలాలను, ఆయన ఆశయాలను గుర్తు చేసుకోవడం ప్రసంశనీయమన్నారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఏపీ ఎన్జీవో సంఘ అధ్యక్షుడు వీ విద్యాసాగర్, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి జీ కోటేశ్వరరావు, ప్రజా సంఘాలు, వ్యవసాయ, కార్మిక సంఘాల నేతలు బుట్టి రాయప్ప, చంద్రా నాయక్, పిచ్చియ్య, పేరయ్య, ఆవుల శేఖర్, ఆంధ్ర మాల్యాద్రి, విజయకుమార్, యలమందరావు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి: కలెక్టర్

● కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారుల సమీక్షా సమావేశం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, చిత్రంలో జేసీ నవీన్, డీఆర్వో చంద్రశేఖరరావు తదితరులు

మచిలీపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నెలకొన్న పలు రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టి పరిష్కారానికి కృషిచేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశపు మందిరంలో జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖరరావు, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవితో కలిసి రెవెన్యూ అధికారుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానంగా ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సేవలపై సానుకూల ప్రజాదృక్పథం (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ - ఐవీఆర్ఎస్) నివేదిక, ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలు, భూమి పరాయీకరణ, భూసేకరణ సమస్యలు, అందరికీ ఇళ్లు, స్మశాన వాటికలు, వాట్సాప్ సూచనలు, కోర్టు కేసులు, సీనియర్ సిటిజన్స్ కేసులు, ధాన్యం సేకరణ, స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ, రీ సర్వే పురోగతి, ప్రభుత్వ ఉద్యోగుల హెల్త్‌కార్డులు, ఉద్యోగుల ఫిర్యాదులు, ఐ గాట్ కర్మయోగి, బ్యాంకు ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వ జీత ప్యాకేజీ అప్డేట్ తదితర అంశాలపై ఉదయం నుంచి సాయంత్రం వరకు రెండు సెషన్‌లుగా సదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తహసీల్దార్లు తమ మండల పరిధిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. అందరికీ ఇళ్లలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల ఇళ్లస్థలాలు మంజూరు చేస్తున్న నేపథ్యంలో అర్హత గల లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వం రూపొందించిన ప్రకారం ఇళ్లస్థలాలు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో ధాన్యం సేకరణ అత్యంత ప్రాధాన్యత అంశమనీ, గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కొన్ని ఇబ్బందులు పడ్డామని గుర్తుచేస్తూ ఈ సారి ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో 312 రైతుసేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు జరుగుతుందని, సుమారుగా 8లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందనీ, 99 శాతం ఈ పంట నమోదు పూర్తయినట్టు జేసీ తెలిపారు. లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ పూర్తిచేయాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో 5,17,835 కార్డులకు 4,75,549 కార్డులు పంపిణీ చేశారనీ, మిగిలిన 42,286 కార్డుల పంపిణీ త్వరగా పూర్తిచేయాలని జేసీ అధికారులకు సూచించారు. మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు కే స్వాతి, జీ బాలసుబ్రహ్మణ్యం, బీఎస్ హేలా షారోన్, సర్వే ఏడీ జోషిలా, విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ ఇన్‌చార్జి, జిల్లా గృహనిర్మాణ సంస్థ అధికారి పోతురాజు, డీఎస్‌వో జీ మోహనరావు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టీ శివరాంప్రసాద్, తదితర జిల్లా శాఖల అధికారులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.



యువతలో 'అల్జీమర్స్'

● ఒత్తిడి, దురలవాట్లే కారణమంటున్న వైద్యులు

ఆంధ్రజ్యోతి - విజయవాడ: మతిమరుపు మనిషికి దేవుడిచ్చిన వరమని కొన్ని సందర్భాల్లో చెప్పుకుంటాం. బాధ, దుఃఖానికి సంబంధించిన కొన్ని సంఘటనలు మరిచిపోతే ఉపశమనం కలుగుతుంది. పని ఒత్తిడి, చదువు, ఆర్థిక సమస్యలతో కలిగే ఒత్తిళ్ల కారణంగా కొన్ని విషయాలు మరిచిపోవచ్చు. ఇది పెద్ద సమస్యేమీ కాదు. కానీ అల్జీమర్స్ వ్యాధి బారినపడిన వ్యక్తి తను నిత్యం చేసుకునే సాధారణ పనులు కూడా మరిచిపోతారని వైద్యులు వెల్లడించారు. అల్జీమర్స్ మెదడుకు సంబంధించిన తీవ్రమైన వ్యాధుల్లో ఒకటి. గతంలో ఈ సమస్యను ఎక్కువగా 60 ఏళ్లు పైబడినవారిలో మాత్రమే కనిపించేంది. ఇటీవల 45 ఏళ్లు దాటినవారిలోనూ కనిపిస్తుండడం ఆందోళన కలిగిసోందని వైద్యనిపుణులు చెబుతున్నారు.

ఇటీవల జరిగిన సంఘటనలు మరిచిపోవడం, వ్యాధి ముదిరే కొద్దీ మాటల్లో తడబాటు, రోజువారీ కార్యక్రమాలు.. నిత్యం చేసే దేవుని పూజ, మందులు వేసుకోవడం, ఇంటి ఆర్థిక వ్యవహారాల వంటి పనులు మరిచిపోవడం జరుగుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. రోజు తిరగాడే దారులు మరిచిపోవడం, ఒక్కోసారి వారున్న స్థలాలను గుర్తించలేని స్థితిలో ఉంటారు. వ్యాధి ప్రారంభంలో గుర్తిస్తే చికిత్స ద్వారా తీవ్రతను తగ్గించవచ్చు. కొందరిలో ఆందోళన, భయభ్రాంతులకు గురవడం వంటి మానసిక మార్పులు కనిపిస్తాయి. అల్జీమర్స్ వచ్చిన తర్వాత రోగి కనీసం తొమ్మిదేళ్లలో మరణించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

అల్జీమర్స్ వ్యాధి రెండు రకాలు. ఒకటి తగ్గించడానికి అవకాశం లేనిది. వయస్సు రీత్యా వచ్చే మతిమరపు వ్యాధిని నివారించలేమని వైద్యులు చెబుతున్నారు. ఇది 65 ఏళ్లు పైబడిన వారికి ఎక్కువగా వస్తుంది. ఇక రెండోది బీపీ, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, మద్యపానం, ధూమపానం, తలకి దెబ్బతగలడం, ఒబెసిటీ, కనీసం శరీర వ్యాయామం లేకపోవడం, గాలి కాలుష్యం, బీ12 విటమిన్ లోపం, బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడినవారు, థైరాయిడ్, స్లీప్ ఎప్నిమియా వంటి లక్షణాలతో అల్జీమర్స్ బారినపడే వారికి చికిత్స ద్వారా నియంత్రించవచ్చని వైద్యులు చెబుతున్నారు.

పెరుగుతున్న అల్జీమర్స్ రోగులు
డాక్టర్ జీ బ్లెస్సీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ న్యూరాలజీ, జీజీహెచ్



కొంతకాలంగా ఆసుపత్రికి వచ్చే అల్జీమర్స్ రోగులు పెరుగుతున్నారు. ఒత్తిడి, దురాలవాట్లు, మెదడులో ఎంఐ లాయిడ్ బీటా, టావ్ అనే వ్యర్థాలు పేరుకుపోవడం వల్లే అల్జీమర్స్‌కు కారణం. అధికశాతం జన్యుపరంగా, ఒత్తిడి కారణంగా అల్జీమర్స్‌కు గురవుతున్నారు. ఇలాంటి అల్జీమర్స్‌ను నయం చేయలేం. వివిధ చెడు అలవాట్లు, వ్యాధుల కారణంగా వచ్చిన అల్జీమర్‌ను నియంత్రించవచ్చు. ఈ విషయాల్లో జాగ్రత్తలు పాటిస్తే ప్రపంచంలో సగం కేసులు నియంత్రించవచ్చు. ప్రతి ఏడాది అల్జీమర్స్ రోగులు పెరుగుతున్నారు. ఈ ఏడాది ఇప్పటికే 8 కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్లుగా 35 మంది చికిత్స పొందుతున్నారు.

రైల్వే డివిజన్‌లో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్



ఉద్యోగులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్ఎం మోహిత్ సోనాకియా

రైల్వేస్టేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో బుధవారం "అవినీతికి నో చెప్పండి, దేశానికి కట్టుబడి ఉండండి" థీమ్‌తో వరుస కార్యకలాపాలను నిర్వహించారు. పారదర్శకత, జవాబుదారీతనం నైతిక పాలన పట్ల రైల్వే తన నిబద్ధతను పునరుద్ఘాటించింది. విజయవాడలోని డీఆర్ఎం కార్యాలయంలో సమగ్రతా ప్రతిజ్ఞతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అధికారులు, సిబ్బంది అన్ని రంగాల్లో నిజాయితీ, న్యాయంగా ఉంటూ మంచి కార్పొరేట్ పాలనను నిలబెట్టడానికి సమష్టిగా పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జాక్ అండ్ జిల్ స్కూల్ మీదుగా ప్లాట్‌ఫామ్ నంబర్-1లోని గాంధీ వెయిటింగ్ హాల్ వరకు విజిలెన్స్ అవేర్‌నెస్ వాకథాన్‌ను నిర్వహించారు. గాంధీ వెయిటింగ్ హాల్‌లో, భారత్ స్కౌట్స్, గైడ్స్ 'విజిలెన్స్ ఆర్గనైజేషన్' అంశంపై ఒక ఆకర్షణీయమైన వీధి నాటకాన్ని ప్రదర్శించారు. డీఆర్ఎం మోహిత్ సోనాకియా మాట్లాడుతూ సమగ్రత కేవలం ఒక సూత్రం కాదు - ఇది ప్రజల విశ్వాసానికి పునాది అని, విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ వంటి కార్యక్రమాల ద్వారా, మన సంస్థ, దేశ పురోగతికి పారదర్శకత, నైతిక ప్రవర్తన అవసరమని గుర్తుచేసుకుంటున్నామన్నారు. ఏడీఆర్ఎంలు వీఈ ఎడ్విన్, శ్రీనివాసరావు కొండా, బ్రాంచ్ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

డివిజన్‌లో 263 ప్రత్యేక రైళ్లు

దసరా, దీపావళి, ఛట్ పూజ పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, అదనపు ప్రయాణీకుల రద్దీని నిర్వహించడానికి, రైలు వినియోగదారులకు సజావుగా, సురక్షితంగా సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించడానికి దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. దేశవ్యాప్తంగా 12,011కి పైగా ప్రత్యేక రైళ్లను నడపాలని ప్రణాళిక వేసింది. వాటిలో 973 రైళ్లు దక్షిణ మధ్య రైల్వేకు చెందినవి కాగా, 263 రైళ్లు విజయవాడ డివిజన్‌కు చెందినవి. సెప్టెంబర్ 21న ప్రారంభమైన ప్రత్యేక రైళ్ల పరంపర - నవంబర్ 30, మధ్య, మొత్తం 1,010 ప్రత్యేక రైళ్లు డివిజన్ ద్వారా నడుస్తాయి. ఇది గత ఏడాదితో పోలిస్తే 5.8% పెరుగుదల. ఈనెల 20 వరకు, దక్షిణ మధ్య రైల్వే 1,010 ప్రత్యేక రైలు సర్వీసులను నిర్వహించింది. వాటిలో విజయవాడ డివిజన్ నడిపిన 104 రైళ్లున్నాయి. డివిజన్ అంతటా ప్రయాణీకుల రద్దీ 1.35 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో 1.21 కోట్ల మంది ప్రయాణికులు ప్రయాణించారు. అదనపు డిమాండ్‌ను తీర్చడానికి, సాధారణ రైళ్లకు 68 అదనపు కోచ్‌లను జత చేశారు. ప్రయాణికుల భద్రత సౌకర్యాన్ని నిర్ధారించడానికి, డివిజన్ విజయవాడ, రాజమండ్రి, నెల్లూరు, గూడూరు వంటి ప్రధాన స్టేషన్లలో సమగ్ర ఏర్పాట్లను అమలు చేసింది. యూటీఎస్ మొబైల్ యాప్, రైల్ వన్ యాప్ ద్వారా డిజిటల్ టికెటింగ్ ప్రమోషన్‌ను చురుకుగా ప్రోత్సహిస్తున్నారు. డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనాకియా మాట్లాడుతూ పండుగ సీజన్‌లో ప్రయాణికుల రాకపోకలు పెరుగుతున్నాయని, తమ బృందాలు సజావుగా సురక్షితమైన ప్రయాణ అనుభవాన్ని నిర్ధారించడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తున్నాయన్నారు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి: ఎంపీ



కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ (ఎన్ఐఆర్‌డి) భాగస్వామ్యంతో, జిల్లా యంత్రాంగం సహకారంతో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని విజయవాడ ఎంపీ, కేశినేని ఫౌండేషన్ చైర్మన్ కేశినేని శివనాథ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్ఐఆర్‌డీ, కేశినేని ఫౌండేషన్ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) అమలుపై కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీ చిన్ని పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనకు ఉపాధి కల్పన అత్యంత కీలకమన్నారు. ఎన్ఐఆర్‌డీతో కలిసి స్వయం సహాయక సంఘాలకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ ఇస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ జనాభా అధికంగా ఉన్న ఏ కొండూరు, జక్కంపూడిలో కామన్ ఫెసిలిటీ సెంటర్ల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం సహకరించాలని కోరారు. ఎన్ఐఆర్‌డీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జీ నరేంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా రూరల్ ప్రాస్పరిటీ, రూరల్ రెస్లియన్స్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. వన్ ఫ్యామిలీ - వన్ ఎంట్రప్రెన్యూర్ అనే ఆలోచనను సాకారం చేయడానికి కేశినేని ఫౌండేషన్‌తో కలిసి ఎస్‌హెచ్‌జీలకు శిక్షణ ఇస్తామన్నారు. పెద్ద కంపెనీల నుంచి ఎస్‌హెచ్‌జీలకు ఆర్డర్లు ఇప్పించి ఆర్థికంగా ఎదిగేందుకు కృషిచేస్తామన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఏ కొండూరు, జక్కంపూడిలో కామన్ ఫెసిలిటీ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. ఏ కొండూరు అభివృద్ధికి డీపీఆర్ రూపొందిస్తామన్నారు. ఆకాంక్షిత బ్లాకులకు ఉన్న 40 సూచీల్లో 25 సూచీల్లో సంతృప్త స్థాయికి చేరుకొన్నామన్నారు. ఏ కొండూరు కూడా ఆకాంక్షిత బ్లాకుల తరహాలో అభివృద్ధి చేస్తామన్నారు. ఎన్ఐఆర్డీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ మహ్మద్ ఖాన్, డీఆర్వో లక్ష్మీ నరసింహం, డీఆర్‌డీఏ పీడీ నాంచారరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసిని పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	137, 146, 157
చికెన్ విత్ స్కిన్	264
చికెన్ స్కిన్‌లెస్	274



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

వేంకటేశ్వరస్వామి దేవస్థాన హుండీ ఆదాయం రూ.3.27లక్షలు

గుడివాడ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : స్థానిక పాటిమీద వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి దేవస్థాన హుండీ ఆదాయ లెక్కింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. దేవాదాయ శాఖ గుడివాడ తనిఖీదారు ఉయ్యూరు సుధాకర్ సమక్షంలో దేవాదాయ శాఖ అధికారులు, భక్తుల సమక్షంలో లెక్కించగా రూ.3,27,590లు ఆదాయం సమకూరినట్టు దేవస్థాన కార్యనిర్వాహణాధికారి కందుల వేణుగోపాలరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ లింగం చిట్టిబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



హుండీ ఆదాయ లెక్కింపులో పాల్గొన్న కమిటీ సభ్యులు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్

కరాటే పోటీల్లో డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : ఇటీవల చెన్నైలో జరిగిన 4వ ఆల్ ఇండియా మవాతికా షిటోరియో ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్-2025లో స్థానిక కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక పాఠశాల ఆవరణలో పతకాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. 14సంవత్సరాలలోపు బాలికల వ్యక్తిగత ఆన్‌లైన్ కటా విభాగంలో బి.చాతుర్యసాయిశ్రీ, కె.ధాత్రికలు ప్రథమ స్థానం సాధించారు. కె.దేదీప్య, సీహెచ్ భవగ్యలు ద్వితీయ స్థానం సాధించారు. కె.ఆనందిక, పి.పనీషా, ఎస్.తారుణ్యలు తృతీయ స్థానం సాధించారని తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులు, కోచ్ ఎన్.వెంకటేశ్వరరావులను ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

కుంగిన కాలిబాట వంతెనతో ఇక్కట్లు

- వంతెనపై నడవాలంటే కష్టం
- శిథిలావస్థకు చేరిన వంతెన
- ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి
- పట్టించుకోని అధికారులు

(తోట్లవల్లూరు - ఆంధ్రజ్యోతి) : కుమ్మమూరు పంచాయతీ శివారు మద్దులవానిగూడెం వద్ద ఏనుగులకోడు డ్రెయిన్‌పై కాలిబాట వంతెన కుంగటంతో రైతులు, వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రెండేళ్ల క్రితం పడమర వైపున మట్టి కోతకు గురై వంతెన శ్లాబు కుంగిపోయింది. దీంతో ప్రజల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. ముఖ్యంగా రైతులు, వ్యవసాయ కూలీలు పొలాలకు వచ్చేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు. బందరు కాలువ వంతెన, ఏనుగులకోడు డ్రెయిన్‌పై కాలిబాట వంతెన ప్రక్కప్రక్కనే ఉన్నాయి. ఈ కాలిబాట వంతెనపైగా పొలాలకు రావాలంటే ప్రమాదకరంగా మారిందని రైతులు చెపుతున్నారు. మద్దులవాని గూడెం, కనకవల్లి, కుమ్మమూరు గ్రామాల రైతులు, కూలీలు ఈ వంతెనలు దాటి పొలాలకు వస్తుంటారు. రెండేళ్లుగా కాలిబాట వంతెన శ్లాబు కుంగి విరగటంతో దినదినగండం అన్నట్టుగా పరిస్థితి తయారయిందంటున్నారు. రైతులు, కూలీలే కాకుండా సమీప గ్రామాల ప్రజలు మండల కేంద్రమైన తోట్లవల్లూరు వచ్చేందుకు ఇది దగ్గరి మార్గంగా ఉంది. కాలిబాట వంతెన దాటితే పెనమకూరు, తోట్లవల్లూరు రోడ్డుకు లింకు అవుతుంది. ఎంతో ముఖ్యమైన కాలిబాట వంతెనను పునర్నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



రెండేళ్ల నుంచి కాలిబాట వంతెన సమస్య ఉంది. పంట పొలాలకు రైతులు, కూలీలు రావటానికి ఇబ్బంది పడుతున్నారు. నడవాలంటేనే జారిపడే పరిస్థితి నెలకొంది. దీంతో కనకవల్లి ప్రజలు ఇటీవల స్తంభాలను అడ్డుపెట్టి ప్రమాదం లేకుండా చేశారు. అధికారులు స్పందించి కాలిబాట వంతెన సమస్యను పరిష్కరించాలి.

కవిలికట్ల శ్రీనివాసరావు, మద్దులవానిగూడెం



ఏనుగులకోడు డ్రెయిన్‌పై కుంగిన కాలిబాట వంతెన

అధికారులు పట్టించుకోవడం లేదు



కాలాబాట వంతెన సమస్యపై అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గ్రామసభల్లో అర్జీలు అందించాం. ఇంత వరకు వంతెన సమస్యను పట్టించుకోలేదు. కొత్త కాలిబాట వంతెన నిర్మించాల్సిన అవసరం ఉంది.

బొమ్మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్

కొనకళ్ల ట్రస్ట్ ఆధ్వర్యంలో నేత్రదానం

గుడివాడ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : స్థానిక 3వవార్డుకు చెందిన కొలుపాకుల వెంకటేశ్వరరావు(85) మృతి చెందటంతో ఆయన మేనల్లుడు జాలాది నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం కొనకళ్ల సీతయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నేత్రదానం చేశారు. విజయవాడ ఎల్.వి ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ మహేష్ నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన నాగేశ్వరరావును ట్రస్ట్ చైర్మన్ కొనకళ్ల సీతయ్య, పలువురు అభినందించారు.

హోటళ్లలో శుభ్రత ప్రమాణాలు పాటించాలి

● మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్

గుడివాడ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలోని హోటళ్లు, లాడ్జిల్లో శుభ్రతా ప్రమాణాలను పాటించాలని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ ఆదేశించారు. బుధవారం స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో హోటళ్లు, లాడ్జిల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్నీ లాడ్జీలు, హోటళ్లలో తనిఖీలు నిర్వహిస్తామని, శుభ్రత విషయంలో ఏమైన లోపాలు తలెత్తితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం నిలిపివేయాలన్నారు. డిసెంబరు నుంచి పట్టణంలో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధిస్తున్నట్లు పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిన వారిపై భారీగా జరిమానాలు విధించబడతాయన్నారు. ట్రేడ్ లైసెన్స్ లేనివారు తక్షణమే లైసెన్సు మంజూరు చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మనోహర్

నకిలీ మద్యం నివారణే కూటమి ధ్యేయం

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పామర్రు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కల్తీమద్యం నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. పామర్రులోని మద్యం దుకాణాలను బుధవారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్‌తోపాటు కూటమిశ్రేణులతో కలసి సందర్శించి దుకాణాల్లో మద్యం స్టాకును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ మద్యం దుకాణాలు, బార్లలో నాణ్యమైన మద్యం విక్రయించేలా అన్ని చర్యలు కూటమి సర్కార్ తీసుకుందన్నారు. దీనిలో భాగంగానే మద్యంబాటిళ్లపై క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం తప్పనిసరి చేసిందన్నారు. దీని కోసం ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్‌ను అమల్లో తీసుకొచ్చిందన్నారు. ప్రతి దుకాణంలో డైలీ లిక్కర్ జెన్యూన్‌నెస్ వెరిఫికేషన్ రిజిష్టర్లు అమలుచేయాలన్నారు. అమ్మిన మద్యం బ్రాండ్ల, బ్యాచ్‌నంబర్, రిజిస్టర్‌లో తప్పక నమోదుచేయాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి నేతలు వల్లూరిపల్లి గణేష్, నాదెళ్ల సుబ్రమణ్యం, టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, జక్కా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మద్యం స్టాకు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



స్వచ్ఛరథం వద్ద నిత్యావసరాలు అందజేస్తున్న సిబ్బంది

గాదేపూడిలో స్వచ్ఛరథం

గుడ్లవల్లేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ రథం మండలంలో ప్రతీరోజూ రోజుకో గ్రామంలో సంచరిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం గాదేపూడిలో స్వచ్ఛరథం సంచరించి గ్రామస్థులు తమకు పనికిరాని ఇనుము, ప్లాస్టిక్, స్టీల్, ఇత్తడి, రాగి తదితర వస్తువులను స్వచ్ఛరథంలో ఇస్తే వాటికి బదులుగా వాటి విలువ చేసే నిత్యావసర సరుకులు అందజేశారు. గురువారం స్వచ్ఛరథం అంగలూరులో సంచరిస్తుందని, గ్రామ ప్రజలకు పంచాయతీ సిబ్బంది తెలియజేశారు. సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళల ద్వారా ఈ సమాచారాన్ని మౌకికంగానూ, వాట్స్ అప్ మెసేజీలద్వారానూ ఇచ్చామని ఎంపీడీవో మహమ్మద్ ఇమ్రాన్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఇమ్రాన్ మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



విద్యార్థులకు క్రీడాదుస్తులు బహుకరించిన కూచిబట్ల కిరణ్‌కుమార్

విద్యార్థులకు క్రీడా దుస్తుల వితరణ

పమిడిముక్కల : ఐనపూరు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులకు నారాయణపురానికి చెందిన ప్రవాసాంధ్రులు కూచిభట్ల కిరణ్ కుమార్, పవన్‌కుమార్‌లు రూ. 10వేలు విలువ చేసే 22 జతల క్రీడాదుస్తులు బుధవారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ మంచి ప్రావీణ్యం సాధించాలన్న ఉద్దేశంతో ప్రోత్సహిస్తూ దుస్తులు పంపిణీ చేసామన్నారు. విద్యార్థులకు క్రీడాదుస్తులు అందజేసేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని హెచ్‌ఎం వేణుగోపాలరావు అన్నారు. ఫిజికల్ డైరెక్టర్ కె.ఫణీంద్ర, సర్పంచ్ కె.జయలక్ష్మి, ఎంపీటీసీ వీర్ల ఆదిశేషు దాతలను అభినందించారు.

వీకేఆర్ ఫెస్ట్-2025 నేడు

గుడివాడ : స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజనీరింగ్ కళాశాలలో వీకేఆర్ ఫెస్ట్, అక్టోబరు-2025ను స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఆడిటోరియంలో ఈ నెల 23,24 తేదీల్లో రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.హెచ్.వి ప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫెస్ట్‌లో మొదటి రోజు విభాగాల వారీగా పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, ప్రాజెక్టు ఎక్స్పో, రెండో రోజు కౌన్ బనేగా స్మార్ట్‌ఫోన్ పతి, బ్రేక్ ది బ్రైరీ, క్రాక్ ది కోడ్, కిక్ ఆఫ్, అడిదా మీమ్, ఎలిమెంట్ హంట్, ట్రెడిషనల్ అండ్ రెటిరో ఫ్యాషన్ షో, సోలో అండ్ గ్రూపు వెస్ట్రన్, ఫోక్, క్లాసికల్ అంశాల్లో డ్యాన్స్ కార్యక్రమాల్లో అన్నీ విభాగాలవారు పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఈ క్రాప్ నమోదుకు తప్పని తిప్పలు

పమిడిముక్కల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈ క్రాప్ నమోదు ప్రక్రియ ఈనెల 25తో ముగియనున్న నేపథ్యంలో చోరగుడిలో ఈ క్రాప్ నమోదు చేయించుకునేందుకు భూములు ఆన్‌లైన్ కాక రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో వ్యవసాయ సహాయకులు వేరే చోటుకు బదిలీపై వెళ్లగా వారి స్థానంలో ఇప్పటివరకు ఎవరూ రాకపోవడంత ఈక్రాప్ నమోదుతో పాటు వ్యవసాయ సంబంధిత పనులు చేసే వారు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామపరిధిలో 1800 ఎకరాల భూమి సాగులో ఉండగా ఇప్పటివరకు 1500 ఎకరాల వరకు పంట నమోదు జరిగింది. కొందరు రైతుల భూములు ఆన్‌లైన్ కాకకోపోవడంతో పంట నమోదు చేసుకునే అవకాశంలేకుండా పోయింది. పంటన మోదు చేసేందుకు వేరే గ్రామాల నుంచి వ్యవసాయ సహాయకులను తీసుకువచ్చి వ్యవసాయ అధికారులు పనులు చేస్తున్నప్పటికీ గడువు లోపల పూర్తయ్యేలా లేదని ఆందోళన చెందుతున్నారు. కాగా దీనిపై మండల వ్యవసాయ అధికారి గణేశ్‌రెడ్డిని వివరణ కోరగా కొందరు రైతులు వారి భూములు ఆన్‌లైన్ చేయించుకోపోవడం వల్ల ఇబ్బంది కలుగుతుందని, పరిస్థితి ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. ఏమైనప్పటికి గడువు లోపల పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

రవికుమార్‌కు సత్కారం

పమిడిముక్కల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర కోఆర్డినేటర్‌గా నియమితులైన తాడంకి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల జీవ శాస్త్ర ఉపాధ్యాయుడు సీహెచ్ రవికుమార్‌ను పాఠశాల ఉపాధ్యాయులు , సిబ్బంది బుధవారం ఘనంగా సత్కరించా రు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్ఎన్ ప్రసా ద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐఎస్ఓ గుర్తింపు కలిగిన అంతర్జాతీయ సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదికకు రవికుమార్ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా నియమితులు కావడం పాఠశాలకు గర్వకారణమన్నారు. ఉపాధ్యాయుడిగా సేవలందించడంతోపాటు సాహితీ, సేవారంగాల్లో పాల్గొంటూ చెరగని లిపి అనే సాహితీ పుస్తకాన్ని ప్రచురించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షుడు, రాష్ట్ర సహకార్యద ర్శిగా పనిచేశారని స్టాఫ్ సెక్రటరీ ఎంఎం హుసేన్ అన్నారు.



రవికుమార్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

హైకోర్టు న్యాయమూర్తి బట్టును కలిసిన ఎస్పీ విద్యాసాగర్

గుడివాడ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : స్థానిక చౌదరిపేటలో హైకోర్టు న్యాయమూర్తి బట్టు దేవానంద్‌ను జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసారు. వివిధ సామాజిక, న్యాయపరమైన అంశాలపై ఇరువురు కాసేపు చర్చించారు. జిల్లా పోలీసు విభాగం తరుపున న్యాయవ్యవస్థకు తమ సహకారం ఉంటుందని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు.



హైకోర్టు న్యాయమూర్తి బట్టును మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ విద్యాసాగర్

గౌరీశంకరస్వామి హుండీ లెక్కింపు 29న

గుడివాడ: స్థానిక గౌరీశంకరపురంలో వేంచేసియున్న గౌరీశంకరస్వామి దేవస్థాన హుండీ ఆదాయ లెక్కింపు కార్యక్రమాన్ని ఈ నెల 29వతేదీన నిర్వహిస్తున్నట్టు దేవస్థాన కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22వ తేదీ బుధవారం మధ్యాహ్నం నిర్వహించాల్సిన హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని కొన్ని అనివార్య కారణాలతో 29కి మార్చినట్లు ఆయన పేర్కొన్నారు.

శివాలయాలకు కార్తీక శోభ



కూచిపూడి బాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కూచిపూడి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభం కావటంతో మండల పరిధిలోని శివాలయాలు కార్తీక మాస శోభను సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా చినముత్తేవి అన్నపూర్ణ సమేత సోమేశ్వరస్వామి, కూచిపూడి బాలాత్రిపుర సుందరీదేవి, మొవ్వ భీమేశ్వరస్వామి ఆలయాలతోపాటు మొవ్వపాలెం, పెదపూడి, గూడపాడు, కోసూరు, కాజ, నిడుమోలు, అయ్యంకి, యద్దనపూడి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో దీపాలంకరణ, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించటంతో ఆలయాలు కార్తీక శోభతో కళకళలాడాయి.

కూచిపూడి: చినముత్తేవిలోని స్వయంభువుగా వెలసిన సోమేశ్వరుడు భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతూ నిత్యం పూజలు అందుకుంటున్నాడు. భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. ఇదే ఆలయ ప్రాంగణంలో చంద్రమౌళేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి వారి ఆలయాలు ఉండటం మరో ప్రత్యేకత. కార్తీక మాస పూజలకు ఆలయాన్ని ఆలయ నిర్వాహకులు సుందరంగా తీర్చిదిద్దారు.

పామర్రు : పామర్రులో వేంచేసియున్న అయ్యప్ప దేవాలయంలో కార్తీకమాసం మొదటి బుధవారం ఆలయప్రధాన అర్చకులు లంకా భీష్మాకుమార్, బేతనబోట్ల పవన్ ఆధ్వర్యంలో కార్తీకమాసోత్సవ ప్రత్యేక పూజాదికాలు, విశేష అభిషేకాలను కన్నెస్వామిగా అయప్పదీక్షా స్వీకరించిన ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ ధర్మవీర్, సాయిభవగ్ని దంపతులు నిర్వహించారు. అనంతరం విచ్చేసిన అయ్యప్ప దీక్షాపరులు 1500మందితోపాటు, ఇతరభక్తులకు అన్నదానం చేశారు. ఆలయ నిర్మాణ దాతలైన తాడిశెట్టి పూర్ణయ్య, నాగేశ్వరరావు(పాము)వంశస్తులు భక్తులకు ఎలాంటి అసౌకార్యలు కలగకుండా ప్రత్యేక షామియానాలతో ఏర్పాట్లను పర్యవేక్షించారు. అయప్ప గురుస్వాములు తాడిశెట్టి సాంబశివరావు, కాకర్ల శంకర్, టీడీపీ సీనియర్ నేత మండపాక శంకర్‌బాబు పలువురు అయ్యప్ప గురుస్వాములు, వారిశిష్యబృందం పాల్గొన్నారు. కార్తీక మాసం ప్రారంభం కావడంతో పెద్దసంఖ్యలో అయ్యప్ప దీక్షను బిందెలస్వామి శిష్యబృందం స్వీక రించారు. అన్నదాన ఏర్పాట్లను రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ వైస్ చైర్మన్ సునీల్ అన్నదాన కార్యక్రమాన్ని పరిశీలించి నిర్వహకులైన ఆలయ నిర్మాణ దాతలను అభినందించారు.

పామర్రు : పామర్రులో వేంచేసియున్న సోమేశ్వరస్వామి(శివాలయంలో) దేవస్థానంలో బుధవారం కార్తీక మాస తొలిరోజు పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి తోలేటి సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఆలయంలో పరమశివునికి వివిధ ప్రాంతాలకు చెందిన దంపతులు కుటుంబ సమేతంగా విచ్చేసి ప్రత్యేక అభిషేకాలు, కార్తీక దీపారాధనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గుడ్లవల్లేరు : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని శైవక్షేత్రాలన్నీ శివనామ స్మరణలతో మార్మోగాయి. వేకువజామున గుడ్లవల్లేరులోని పుల్లేరులో మహిళలు, శివభక్తులు పాడ్యమి స్నానాలు ఆచరించి దీపారాధనలు చేశారు. గుడ్లవల్లేరు శ్రీమత్ గంగాపార్వతీ సమేత సిద్ధేశ్వర స్వామి ఆలయంలో సిద్ధేశ్వర స్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంకాలం ఆకాశదీపార్చన అనంతరం భక్తులు జోరు వర్షంలో సైతం ఆలయ ప్రాంగణంలో దీపారాధనలు చేశారు. మహిళలు సామూహికంగా కార్తీక పురాణం పారాయణం చేశారు. కౌతవరం గౌతమేశ్వస్వామి ఆలయంలో, వడ్లమన్నాడు, పెసరమిల్లి, విన్నకోట శివాలయాల్లో, అంగలూరు అమరలింగేశ్వరుని ఆలయాల్లో శివునికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.



విద్యుత్ వెలుగుల్లో గుడ్లవల్లేరు సిద్ధేశ్వరస్వామి ఆలయం



అయ్యప్పసన్నిదానంలో ప్రత్యేకపూజలు చేస్తున్న వైద్యనిపుణులు ధర్మవీర్, భవాగ్నీ దంపతులు



విద్యుత్ వెలుగుల్లో సోమేశ్వరస్వామి ఆలయం

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	137, 146, 157
చికెన్ విత్ స్కిన్	264
చికెన్ స్కిన్‌లెస్	274

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

3 నుంచి ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

అవనిగడ్డ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అవనిగడ్డ డిగ్రీ కళాశాలలో నవంబరు 3వ తేదీ నుంచి మహిళలకు బ్యూటీషియన్, స్త్రీ, పురుషులకు డేటా ఎంట్రీ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తారని, 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల వారు శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. బుధవారం తన కార్యాలయంలో ఉచిత శిక్షణ కార్యక్రమాల పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉద్యోగి పృథ్వీజ పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్


తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

మద్యం షాపులో తనిఖీ

పెడన, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దేవీ వైన్స్ మద్యం షాపును బుధవారం ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మద్యం బాటిళ్లను పరిశీలించారు. సురక్ష యాప్ ద్వారా ఆయన క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి మద్యం నాణ్యతను ఆయన పరిశీలించారు. ప్రతి సీసాను స్కాన్ చేసిన తరువాతే వినియోగదారులకు విక్రయించాలని షాపు నిర్వాహకులకు సూచించారు. నకిలీ మద్యం దొరికితే అందుకు లైసెన్సీలే బాధ్యత వహించాలని ఎమ్మెల్యే హెచ్చరించారు.


చల్లపల్లి ప్రధాన సెంటర్‌లో..


అవనిగడ్డలో..




మోపిదేవి, కోడూరు మండలం నరసింహాపురంలో రోడ్లపై నిలిచిన నీరు

భారీ వర్షం

● స్తంభించిన జనజీవనం

అవనిగడ్డ/అవనిగడ్డ రూరల్/నాగాయలంక/కోడూరు/మోపిదేవి/చల్లపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ నియోజకవర్గంలో బుధవారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తోన్న వర్షం కారణంగా జలజీవనం స్తంభించిపోయింది. ప్రజలు దైనందిన కార్యక్రమాల కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అవనిగడ్డ చింత చెట్టు సెంటర్లు, కోర్టు వద్ద, 8వ వార్డులో, ఎస్టీ కాలనీలో, మండలిపురం ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాల్లో రహదారులపై నీరు నిలిచిపోయింది. చల్లపల్లి మండలంలో కుండపోతగా వర్షం కురిసింది. భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. పల్లపు ప్రాంతాల్లో నీళ్లు నిలిచాయి. మట్టి రోడ్లు బురదకయ్యలుగా మారాయి. అంతర్గత రహదారులపై వర్షపునీరు నిలిచింది. వర్షంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. కోడూరు - నరసింహాపురం రహదారి వర్షానికి జలమయం అయింది. కోడూరు సంత మార్కెట్ వద్ద, నరసింహాపురం గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రోడ్డుపై భారీగా వర్షపు నీరు నిలిచింది సమీపంలోని డ్రెయినేజీ ఉన్నప్పటికీ అందులోకి నీరు మళ్లించే వారు కరువవ్వడంతో ఈ పరిస్థితి నెలకొందని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామపంచాయతీ వారు స్పందించి రహదారిపై నీరు నిల్వ ఉండకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. మోపిదేవి మండలంలోని గ్రామాల్లో డ్రెయినేజీ సౌకర్యం సక్రమంగా లేక రహదారుల వెంబడి నీళ్లు నిలిచాయి. మోపిదేవిలో ప్రధాన రహదారులపై మోకాళ్ల లోతు నీరు నిలిచింది. డ్రెయినేజీల నుంచి వర్షపునీరు పొంగి పొర్లడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. నాగాయలంకలో వర్షానికి డ్రెయిన్లు పొంగిపొయి ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు వర్షం నీటితో నిండిపోయి చెరువులను తలపించాయి. బస్టాండ్ ప్రాంగణంలోకి వర్షం నీరు భారీగా చేరింది. రహదారులపై వర్షం నీరు చేరటంతో వాహదానరులు, ప్రజలతో పాటు దుకాణదారులు, చిరు వ్యాపారులు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు.

కూలిన భారీ వృక్షం

మచిలీపట్నం టౌన్: భారీ వర్షాలు, గాలికి మంగినపూడి బీచ్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో భారీ చెట్టు నేల కొరిగింది. రాక పోకలకు ఇబ్బందిగా ఉండడంతో పంచాయతీ అధికారులు, అగ్నిమాపక సిబ్బంది వృక్షాన్ని తొలగించారు.


బీచ్‌కు వెళ్లే రోడ్డుపై నేలకొరిగిన వృక్షం

పంట మొత్తం కొనుగోలు చేయాలి

చల్లపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈ సార్వా సీజన్‌లో రైతులు పండించిన పంటలో 50శాతం మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించటం సరికాదని, రైతులు పండించిన పంట మొత్తం కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, కౌలురైతుసంఘం పిలుపుమేరకు మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం డిప్యూటీ తహసీల్దార్ శ్రీలతకు రైతు, కౌలురైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. యద్దనపూడి మధు, వాకా రామచంద్రరావు, లంకపల్లి సత్యనారాయణ, కరీముల్లా పాల్గొన్నారు.

కొక్కిలిగడ్డ పీఏసీఎస్ ఛైర్మన్‌గా కోనేరు నాగేశ్వరరావు

మోపిదేవి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కొక్కిలిగడ్డ పీఏసీఎస్ ఛైర్మన్‌గా కోనేరు నాగేశ్వరరావు, సభ్యుడిగా మలిశెట్టి రాజేంద్రప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్, మండల ఇన్‌చార్జ్ కె.లీలావతి, పీఏసీఎస్ కార్యదర్శి మునిపల్లి నాగమునీంద్రరావు, బొబ్బర్లంక, కొక్కిలిగడ్డ టీడీపీ నాయకులు దొప్పలపూడి జగదీష్, ముమ్మనేని బాబూరావు, కోనేరు చంద్రమౌళి, బాలశ్రీధర్, లక్ష్మణరావు, బాలతేజ, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న కోనేరు నాగేశ్వరరావు

చెన్నూరు, కమలాపురం, పెడన పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీల నియామకం

పెడన రూరల్: చెన్నూరు, కమలాపురం, పెడన వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు త్రిసభ్య కమిటీలను ప్రభుత్వం ప్రకటించింది. చెన్నూరు పీఏసీఎస్ ఛైర్మన్‌గా యర్రంశెట్టి దేవేంద్రప్రసాద్, సభ్యులుగా నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, దొండపాటి శివనాగరాజు, కమలాపురం పీఏసీఎస్ ఛైర్మన్‌గా కొట్టే సురేష్, సభ్యులుగా బొల్లా వెంకటేశ్వరరావు, తాడిశెట్టి సూరయ్య, పెడన జయలక్ష్మి పీఏసీఎస్ ఛైర్మన్‌గా యర్రపోతు నాగేశ్వరరావు, సభ్యులుగా బూసం డోలాంబ, కూనపరెడ్డి రంగయ్యనాయుడును నియమిస్తూ వ్యవసాయ, సహకార శాఖ ఉత్తర్వులు జారీచేసింది. పాలకవర్గ ఛైర్మన్, సభ్యులను పలువురు అభినందించారు.

నాగుల చవితికి విస్తృత ఏర్పాట్లు

మోపిదేవి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితి సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే వేడుకల్లో భక్తులకు అసౌకర్యం కలుగకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. బుధవారం దేవస్థానం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 25వ తేదీ తెల్లవారుజామున 2.30 గంటలకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దంపతులు నాగపుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభిస్తారని తెలిపారు. 3 గంటలకు స్వామికి పంచామృతాభిషేకం, అనంతరం భక్తులకు నాగపుట్ట, స్వామి దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. 50 వేల మందికిపైగా భక్తులు మోపిదేవికి విచ్చేస్తారని, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో సమాచార కమిషనర్

మోపిదేవి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని రాష్ట్ర సమాచార కమిషనర్ ఎ.ఉదయ భాస్కర్‌రెడ్డి బుధవారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. కమిషనర్‌ను ఆలయ మర్యాదలతో సత్కరించి, స్వామి ప్రసాదం, చిత్రపటాన్ని ఆలయ పర్యవేక్షకుడు అచ్యుత మధుసూదనరావు బహూకరించారు.


ఉదయభాస్కర్‌రెడ్డికి స్వామి చిత్రపటం అందిస్తున్న ఆలయ పర్యవేక్షకుడు మధుసూదనరావు


నడకుదురు పృథ్వీశ్వరస్వామి


కోడూరు శివాలయంలో..


నాగాయలంక రామలింగేశ్వరస్వామి..

ఆలయాల్లో కార్తీక శోభ

కార్తీక మాసం బుధవారం నుంచి ప్రారంభం కావడంతో శివాలయాల్లో స్వామివార్లకు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము నుంచే అభిషేకాలు, దీపారాధానలు, పూజలు చేశారు.


ఘంటసాలలో జలధీశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

అందుబాటులోకి పురమిత్ర యాప్

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు తక్షణ సేవలందించేందుకు పురమిత్ర యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు నగర కమిషనర్ చోడే వీరవెంకట సత్యాబాపిరాజు తెలిపారు. బుధవారం పురమిత్ర యాప్ వినియోగంపై ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. నగర ప్రజలు ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా ప్లే స్టోర్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మునిసిపల్ సేవలు, ఫిర్యాదులు, పన్నుల చెల్లింపులు, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు వంటి 122 సేవలను ఈ యాప్ ద్వారా పొందవచ్చన్నారు. వీధి దీపాలు వెలగకపోయినా, చెత్త పేరుకుపోయినా ఈ యాప్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చన్నారు.

కుక్కల దాడిలో లేగదూడకు తీవ్రగాయాలు

● శస్త్రచికిత్స చేసిన వైద్యుడు

గూడూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తరకటూరులోని సౌభాగ్య గోశాలకు చెందిన లేగదూడ కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడింది. బుధవారం గూడూరు వెటర్నరీ వైద్యాధికారి అల్తాఫ్ హుస్సేన్ శస్త్రచికిత్స చేశారు. గోశాలలో మంగళవారం సాయంత్రం గిర్ జాతి గోవు లేగదూడకు జన్మనిచ్చింది. లేగదూడపై కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. దీంతో గోశాల నిర్వాహకులు లేగదూడను వైద్యశాలకు తీసుకువచ్చారు. లేగదూడ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, త్వరలో కోలుకుంటుందని అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు.

హైస్కూల్‌కు బీరువాలు అందజేత

పెడన, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పీ-4 కార్యక్రమంలో భాగంగా పూర్వ విద్యార్థులు మార్గదర్శకులుగా మారి సమాజానికి మంచి పనులు చేయాలని ఎంఈవో ఎన్.సలోమి సూచించారు. 1995-96లో పట్టణంలోని బీజేకే జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదివిన విద్యార్థులు తమతో పాటు చదువుకుని ఇటీవల మృతిచెందిన తమ స్నేహితుడు కొరారి మురళీధర్‌బాబు జ్ఞాపకార్థం హైస్కూల్‌కు రూ. లక్ష విలువ చేసే నాలుగు బీరువాలను బుధవారం బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 వై.వి. హరనాథ్, హెచ్ ఎం ఎల్. ఇందిర, పూర్వ విద్యార్థులు బళ్ళ జ్యోత్స్నరాణి (మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్), బల్లా పద్మావతి (కౌన్సిలర్), మెట్ల సురేష్, పేరక నాగరాజు, కొల్లిపర పూర్ణప్రదీప్, అబ్దుల్ వాజీద్, దివి పైడిరాజు, అనగాని ధనలక్ష్మి, ఎండి రఫి, కుర్మా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రంగ అభివృద్ధికి లోకేశ్ కృషి అభినందనీయం

● టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆక్వా రంగ అభివృద్ధికి మంత్రి నారా లోకేశ్ చేసిన కృషి అభినందనీయమని టీడీపీ సీనియర్ నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ ప్రశంసించారు. బుధవారం శిడింబి అగ్రహారంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్ట్రేలియాతో ఆక్వా బంధం కొత్త అవకాశాలకు నాంది కానుందన్నారు. అమెరికా అధిక సుంకాల నేపథ్యంలో ఏపీ ఆక్వా ఉత్పత్తులకు కొత్త మార్కెట్లు కల్పించాలనే లోకేశ్ దూరదృష్టి ప్రశంసనీయమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో పెట్టుబడుల వర్షం కురుస్తోందన్నారు.